హైవే దాటిన చిరుత పులి
దసరా, దీపావళి పర్వదినాలకు 21 వారాంతపు 'పూజ' ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు

కొత్త పింఛన్లు ఎప్పుడో?



- గత వైసీపీ ప్రభుత్వంలో లబ్ధిదారులకు మొండి చెయ్యి
- దరఖాస్తు ప్రక్రియను కష్టతరం చేసిన నాటి జగన్ సర్కార్
- ఆరు నెలలకు ఒకసారి అవకాశం
- నిబంధనల పేరిట ఇష్టారాజ్యంగా లబ్ధిదారుల తొలగింపు
- కూటమి ప్రభుత్వం రాకతో ఆశలు

పెద్దాపురం, సెప్టెంబరు 17: కొత్త పింఛన్లు ఎప్పుడు? ప్రస్తుతం అర్హులైన ఆశావహుల్లో ఇదే ప్రశ్న తలెత్తుతోంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పింఛన్ల కోసం లబ్ధిదారులు ఎప్పటికప్పుడు దరఖాస్తు చేసుకుని నమోదు చేయించుకునే అవకాశం ఉండేది. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో ఇదో పెద్ద ప్రహసనంగా మారింది. ఆరునెలలకోసారి మాత్రమే నమోదుకు అవకాశం దక్కేది. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వంలో తమకు అవకాశం ఎప్పుడు దక్కుతుందో? ఎప్పటినుంచి పింఛన్లు లబ్ధి పొందుతామో అని వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు ఎదురుచూస్తున్నారు. కొత్తగా పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశంపై కొండంత ఆశతో లబ్ధిదారులు ఉన్నారు. పింఛను మొత్తాన్ని కూటమి ప్రభుత్వం వచ్చీ రావడంతోనే రూ.3వేలనుంచి రూ.4వేలకు పెంచింది. దీంతో వైసీపీ హయాంలో నిబంధనల వడపోతతో అనర్హత బారిన పడి పింఛన్లు కోల్పోయిన వేలాదిమంది అవకాశంకోసం ఎదురుచూస్తున్నారు. కాకినాడ జిల్లాలో కొత్త పింఛన్లకోసం ఎదురుచూసే వారి సంఖ్య 15వేలకు పైగా ఉన్నట్లు అధికారులు అంచనాలు వేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో 2,97,319మంది లబ్ధిదారులు వివిధ రకాల పింఛన్లు అందుకుంటున్నారు.

నాడు నిరంతర ప్రక్రియగా నమోదు

2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో పింఛన్ల నమోదు ప్రక్రియ నిరంతరాయంగా జరిగేది. లబ్ధిదారులు వారంలో ఏ రోజైనా పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునే వీలు ఉండేది. వాటిని ఏ వారానికి ఆ వారం పరిశీలించి నెలాఖరుకు జాబితాను సిద్ధం చేసేవారు. ఫలితంగా అర్హులైన లబ్ధిదారులకు ఆ మరుసటి నెల నుంచే పింఛన్ పొందే అవకాశం ఉండేది. కానీ వైసీపీ ప్రభుత్వం ఈ విధానానికి స్వస్తి పలికింది. ఆరునెలలకొకసారి మాత్రమే లబ్ధిదారుల జాబితా రూపొందించే విధానం తెచ్చింది. ఏటా జూన్, డిసెంబరు నెలల్లోనే జాబితా రూపొందిస్తామని చెప్పింది. గడచిన ఐదేళ్లలో ఒక్కసారి కూడా ఆ ప్రకారం జాబితాలను రూపొందించిన దాఖలాలు లేవు. అప్పట్లో విద్యుత్, ఇన్‌కంట్యాక్స్, నాలుగు చక్రాల వాహనం, ఇళ్ల స్థలం, పొలం తదితర కారణాల పేరిట వందలాదిమంది పింఛన్లు తొలగించారు. పొరపాటున తిరస్కరణకు గురైతే మరో ఆరునెలలు ఆగాల్సి వచ్చేది. ఇలా అర్హులైన లబ్ధిదారులు వేలాదిమంది ఏళ్లతరబడి పింఛన్ కోల్పోయిన పరిస్థితి. ఇటువంటి వారంతా కూటమి ప్రభుత్వంపై ఆశలు పెంచుకున్నారు. కొత్త పింఛన్లపై కూటమి ప్రభుత్వం కొత్త నోటిఫికేషన్‌కోసం పలువురు ఎదురుచూస్తున్నారు. అనేకమంది ఒకచోటనుంచి వేరే ప్రాంతానికి మారినవారు ఉన్నారు. వారు కూడా పింఛన్‌ను ప్రస్తుతం ఉండే చోటికి బదిలీ చేసుకోవాలని చూస్తున్నారు.

నష్టం.. రూ.172కోట్లు



ఏలేరు వరదలు, వరుస భారీవర్షాలతో జిల్లావ్యాప్తంగా అన్నిశాఖలకు కలిపి మొత్తం రూ.172కోట్లు నష్టం వాటిల్లింది. ఈ మేరకు అధికారులు అంచనాలు పూర్తి చేసి ఎట్టకేలకు లెక్క తేల్చారు. ఈ మొత్తం నిధులను జిల్లాకు మంజూరు చేయాలని కోరుతూ ప్రభుత్వానికి కలెక్టర్ నివేదిక పంపారు. అత్యధికంగా ఏలేరు వరదవల్ల ఎక్కడికక్కడ అనేక మండలాల్లో కాలువలకు గండ్లు పడడం, కాలువలు కొట్టుకుపోవడంతో రూ.53.56కోట్లు నష్టం జరిగినట్లు నిర్ధారించారు. భారీవర్షాలవల్ల, వరదలతోను పలుచోట్ల రహదారులు ధ్వంసమవడం, బ్రిడ్జిలు కొట్టుకుపోవడం, కుంగిపోవడం తదితర ఘటనలతో రూ.44.72కోట్లు నష్టం వాటిల్లినట్లు సర్వేలో గుర్తించారు.

- ఏలేరు వరద, భారీ వర్షాలకు జిల్లాకు జరిగిన నష్టం ఇదీ
- ఎట్టకేలకు పూర్తయిన ప్రభుత్వ శాఖల వారీగా నష్టం అంచనాలు
- వరద ఉధృతితో కాలువలకు గండ్లు, ధ్వంసంతో జరిగిన నష్టం రూ.53.56కోట్లు
- రహదారులు, ఇతర బ్రిడ్జిలు కొట్టుకుపోవడంతో తేలిన నష్టం రూ.44.72కోట్లు
- వరదలు, వర్షాలతో జిల్లావ్యాప్తంగా 34,812 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు
- మొత్తం నష్టపోయిన అన్నదాతలు 24,879: తేలిన నష్టం రూ.25.12కోట్లు
- ఇళ్లలోకి వరద, ముంపుతో రూ.16.82కోట్లు నష్టం: ప్రభుత్వానికి కలెక్టర్ నివేదిక

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)/కలెక్టరేట్:

జిల్లావ్యాప్తంగా వరదలు, వర్షాలతో 34,812 ఎకరాల్లో వరి, ఇతర వాణిజ్య పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ గుర్తించింది. మొత్తం 24,879మంది రైతులు నష్టపోయారని, వీరికి రూ.25.12కోట్లు మంజూరు చేయాలని తేల్చారు. ఇళ్లలోకి వరద రావడం, బురద మేటలు వేయడంతో పరిహారం కింద రూ.16.82కోట్లు చెల్లించాల్సి ఉందని ప్రభుత్వానికి పంపిన నివేదికలో కలెక్టర్ వివరించారు.

ఎక్కడికక్కడ కకావికలం..

ఇటీవల ఏలేరు వరద జిల్లాను అమాంతం వణికించేసింది. ప్రత్తిపాడు, పిఠాపురం, జగ్గంపేట, పెద్దాపురం నియోజకవర్గాల్లో తొమ్మిది మండలాలను పూర్తిగా ముంచేసింది. ఎగువన భారీగా కురిసిన వర్షాలతో రిజర్వాయరుకు 47వేల క్యూసెక్కులకుపైగా వరద తన్నుకు వచ్చేసింది. దీంతో జలాశయం పూర్తిగా నిండిపోవడంతో వచ్చిన వరదను వచ్చినట్లు దిగువకు వదిలేశారు. దీంతో ఒక్కసారిగా ఏలేరు కాలువలు వరద ఉధృతితో పొంగిపొర్లాయి. ఎక్కడికక్కడ కాలువలకు 60కిపైగా గండ్లు పడ్డాయి. పలుచోట్ల కొట్టుకుపోయాయి. దీంతో 9 మండలాల్లో మండలాల్లో 66గ్రామాలు వరదతో విలవిల్లాడాయి. అదే సమయంలో భారీవర్షాలు జిల్లావ్యాప్తంగా ఏక ధాటిగా కురవడంతో జిల్లాలో మిగిలిన మండలాల్లోను పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. తక్షణమే నష్టం అంచనాలను రూపొందించి పంపాలని ఆదేశించింది. సీఎం చంద్రబాబు గత బుధవారం రాజుపాలెం గ్రామానికి స్వయంగా వచ్చి వరద బాధితులను పరామర్శించారు. బాధిత కుటుంబాలకు రూ.10వేల చొప్పన సాయం ప్రకటించారు. పంటలు నష్టపోయిన అన్నదాతలకు హెక్టారుకు రూ.25వేలు ప్రకటించారు. నష్టం అంచనాలు ఈనెల 17 నాటికి పూర్తి చేసి పంపాలని ఆదేశించారు. దీంతో అధికారులు యుద్ధప్రాతిపదికన బాధిత మండలాల్లో అన్ని రకాల సర్వేలను పక్కాగా చేపట్టారు. శాఖల వారీగా క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించి నష్టం లెక్కలు నమోదు చేశారు. వీటన్నింటినీ మదించి ఎట్టకేలకు మంగళవారం నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి పంపారు. దీనిప్రకారం రోడ్లు, భవనాల శాఖకు రూ.44.72కోట్లు నష్టం జరిగినట్లు గుర్తించారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 9,211 గృహాలు పాక్షికంగాను పూర్తిగాను దెబ్బతిన్నట్లు లెక్క తేల్చారు. వీటి నష్టం రూ.16.82 కోట్లుగా లెక్కగట్టారు. వరద నీటివల్ల ఆటోలు, నాలుగు చక్రాల వాహనాలు దెబ్బతినగా ఈ నష్టం రూ.35లక్షలుగా గుర్తించారు. వరదలకు ఇద్దరు మృతి చెందడంతో పరిహారం కింద రూ.10లక్షలు నష్టపరిహారంగా నివేదికలో కోరారు. పశుసంవర్ధకశాఖ పరిధిలో రూ.1.11కోట్లు, ముంపునకు గురైన చేపల చెరువులకు రూ.38 లక్షలు, విద్యుత్‌శాఖకు రూ.44.65లక్షలు, సామాజికభవనాలకు రూ.3.82 కోట్లు నష్టం జరిగిందని పేర్కొన్నారు. వరద బాధితులకు ఆహారం, మందులు, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ వసతికల్పనకు రూ.14.48 కోట్లు, నిత్యావసర సరుకుల పంపిణీకి రూ.8.15కోట్లు అయినట్లు పేర్కొన్నారు. రూ.172కోట్లు పరిహారం కింది మంజూరు చేయాలని ప్రభుత్వానికి కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపారు.

పంటనష్టం భారీగానే..

ఏలేరు వరద, భారీ వర్షాల కారణంగా జిల్లావ్యాప్తంగా 34,812 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు జిల్లా వ్యవసాయశాఖ నిర్ధారించింది. మొత్తం 24,879మంది రైతులు నష్టపోయారని తేల్చింది. దీంతో పంట నష్టం రూ.25.12కోట్లుగా లెక్కగట్టారు. వరితోపాటు, మినుము, పత్తి పంటలకు నష్టం జరగ్గా, 33శాతానికి పైగా నష్టం జరిగిన పంటలను మాత్రమే లెక్కింపులో నమోదు చేశారు.ప్రధానంగా పిఠాపురం, కిర్లంపూడి, యూ.కొత్తపల్లి, గొల్లప్రోలు మండలాల్లో పంటలు తీవ్రంగా నష్టపోయినట్లు నష్టం లెక్కింపు నమోదులో అధికారులు గుర్తించారు. పిఠాపురం మండలంలో 6,604 ఎకరాల్లో పంటనష్టం జరగ్గా 4,730 మంది రైతులు నష్టపోయినట్లు నివేదికలో పేర్కొన్నారు. కిర్లంపూడి మండలంలో 6,129 ఎకరాల్లో పంటలు ధ్వంసం కాగా 4,778 మంది రైతులు వీధిన పడ్డారు. యు.కొత్తపల్లి మండలంలో 5,192 ఎకరాలు ముంపునకు గురవగా 3,099 మందిరైతులు నష్టపోయారు. గొల్లప్రోలు మండలలో 4,334 ఎకరాల్లో పంటలు కుళ్లిపోగా 2,922 మంది రైతుల పెట్టుబడి నీటి పాలైంది. సామర్లకోటలో 2,984 ఎకరాలు, పెద్దాపురంలో 2,843, పెదపూడి 1,758, తొండంగి 1,546, జగ్గంపేట 1,079, ప్రత్తిపాడు 675, ఏలేశ్వరం 619, కాకినాడ రూరల్ 409, తుని 311, కోటనందూరు 94, తాళ్లరేవు 84 ఎకరాల్లో నష్టం జరిగినట్లు తేల్చారు.

దెబ్బతిన్న ఇళ్లు ఇలా...

వరద ముంపుతో జిల్లావ్యాప్తంగా కిర్లంపూడి మండలంలో 3,262, గొల్లప్రోలు 2,071, పిఠాపురం 1,490, యు.కొత్తపల్లి 1,109, పెదపూడి 122, ప్రత్తిపాడు 57, తునిఅర్బన్ 56, ఏలేశ్వరం 10, కాకినాడ రూరల్ 5, పెద్దాపురం 107, సామర్లకోట 115, గండేపల్లి 14, తొండంగి 687, శంఖవరం 20, పిఠాపురం అర్బన్ 58, తునిరూరల్ 22 చొప్పున ఇళ్లు దెబ్బతిన్నట్లు తేల్చారు. పంట,ఆస్తినష్టానికి సంబంధించి ప్రతిఒక్కరికీ న్యాయం జరిగేలా నష్టం అంచనాల్లో ప్రాధాన్యత కల్పించామని, నిధులు విడుదల కోరుతూ నివేదిక పంపామని కలెక్టర్ పేర్కొన్నారు.

మా రూటే సెపరేటు

- పిఠాపురం పట్టణంలోకి ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సులు రాని వైనం
- అన్నీ బైపాస్ మీదుగానే పయనం
- దూరప్రాంత ప్రయాణికుల ఇక్కట్లు
- ఆదాయం వస్తున్నా ఆర్టీసీ నిర్లక్ష్యం

పిఠాపురం, సెప్టెంబరు 17: ప్రముఖ పుణ్యక్షేత్రాలకు నిలయంగా ఉన్న పిఠాపురం పట్టణానికి ఉభయ తెలుగురాష్ట్రాలతోపాటు దేశంలోని వివిధ ప్రాంతాలనుంచి భక్తులు నిత్యం వందల సంఖ్యలో ముఖ్యమైన పర్వదినాల సమయాల్లో ఈ సంఖ్య వేలు, లక్షల్లో ఉంటుంది. నియోజకవర్గ కేంద్రం, సుమారు 75 గ్రామాలకు ముఖ్యకూడలిగా ఉన్న పిఠాపురం నుంచి దూర ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రయాణికులు అధికంగానే ఉంటారు. ఒకప్పుడు పిఠాపురం బస్‌స్టేషన్‌లోకి 100 వరకూ ఎక్స్‌ప్రెస్ సర్వీసులు వచ్చేవి. పట్టణంలో నుంచి ఎక్స్‌ప్రెస్ సర్వీసులు రావడంతోపాటు వివిధ ప్రాంతాల్లో మూడుచోట్ల హాల్టులు కల్పించడంతో ప్రయాణికులకు సౌకర్యంగా ఉండేది. ఇప్పుడు ఒక్క ఎక్స్‌ప్రెస్ సర్వీసూ లోపలికి రావడం లేదు.

అన్ని ప్రాంతాలకు వెళ్లేందుకు

పిఠాపురం పట్టణంనుంచి అన్ని ప్రాంతాలకు వెళ్లేందుకు ఒకప్పుడు ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులు అందుబాటులో ఉండేవి. గ్రామాలు, పట్టణ ప్రజలకు అనువుగా ఉండేందుకు, వారి స్వస్థలాలకు వెళ్లేందుకు వీలుగా పిఠాపురం బస్‌స్టేషన్‌తోపాటు ప్రభుత్వాసుపత్రి సెంటర్, ఉప్పాడ సెంటర్లలో ఎక్స్‌ప్రెస్ సర్వీసులకు హాల్టులు కల్పించారు. ఒకప్పుడు పిఠాపురం బస్‌స్టేషన్ మీదుగా విశాఖపట్టణ వెళ్లేందుకు ప్రతి అరగంటకు ఎక్స్‌ప్రెస్ సర్వీసులు అందుబాటులో ఉండేవి. వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు ఎక్స్‌ప్రెస్ సర్వీసులు ఉండడంతో ప్రయాణికులు రైళ్ల కంటే వీటిలో ప్రయాణించేందుకు ఆసక్తి ప్రదర్శించేవారు. రాత్రి 9.30గంటల తర్వాత కాకినాడ, తుని, అన్నవరం తదితర ప్రాంతాల నుంచి పిఠాపురం రావాలంటే సాధారణ బస్సులు అందుబాటులో లేకున్నా ఎక్స్‌ప్రెస్‌లు అందుబాటులో ఉండడంతో రాకపోకలకు ఇబ్బంది ఉండేది కాదు.

ఆలస్యం సాకుగా చూపి..

ఆలస్యం పేరుతో అధికారులు తీసుకున్న అనాలోచిత నిర్ణయం పిఠాపురం పరిసర ప్రాంతాల ప్రజలకు శాపంగా మారింది. పట్టణంలో నుంచి ఎక్స్‌ప్రెస్ సర్వీసులు వెళ్లడం వల్ల ప్రయాణంలో తీవ్ర జాప్యం జరుగుతోందని, పిఠాపురంలో ట్రాఫిక్ అధికంగా ఉంటోందని కారణం చూపి వీటిని బైపాస్‌రోడ్డు మీదుగా వెళ్లేందుకు అధికారులు ఆదేశాలు ఇచ్చారు. వాస్తవంగా పట్టణం మీదుగా ఈ సర్వీసులు వెళ్లినా ఐదు నిమషాలకు మించి ఆలస్యం కాదు. దాన్ని మరుగున పెట్టి ఒకొక్కటిగా అన్ని సర్వీసులను బైపాస్ బాట పట్టించారు. నేడు ఒక్క ఎక్స్‌ప్రెస్ పట్టణంలోకి రాని పరిస్థితిని కల్పించారు. దీంతో దూరప్రాంతాలకు వెళ్లే ఎక్స్‌ప్రెస్‌లు ఎక్కాలంటే బైపాస్‌రోడ్డులోకి ప్రయాణికులు పడిగాపులు పడాల్సిన పరిస్థితి. ఏ రవాణా సౌకర్యం అందుబాటులో లేక నడక ఆశ్రయించాల్సి వస్తున్నది. ఇళ్లకు చేరుకునేందుకు కిలోమీటర్ల మేర నడవాల్సిన పరిస్థితి ఏర్పడింది.



పిఠాపురం బైపాస్‌రోడ్డులో వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ సర్వీసులు

ఇది మా తప్పిదం అన్న ఎండీ

కొన్ని సంవత్సరాల క్రితం అప్పటి ఆర్టీసీ ఎండీ సాంబశివరావు పిఠాపురం పట్టణంలోని పుణ్యక్షేత్రాల్లో పూజలు నిర్వహించి బస్‌స్టేషన్‌ను సందర్శించారు. పిఠాపురం పట్టణంలోని ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ సర్వీసులు రావడం లేదన్న విషయాన్ని తెలుసుకుని విస్మయానికి లోనుకావడమేగాక ఇది మా ఆర్టీసీ అధికారుల తప్పిదమే అంటూ బహిరంగంగా అంగీకరించారు. నాన్‌స్టాప్ మినహా అన్ని ఎక్స్‌ప్రెస్ సర్వీసులు పిఠాపురం వచ్చేలా చర్యలు తీసుకుంటామని ప్రకటించడమే గాక తక్షణం అమలు చేయాలని ఆదేశాలు ఇచ్చారు. మూడునెలలపాటు సగం వరకూ సర్వీసులు పట్టణం మీదుగా వెళ్లేవి. తదనంతరం మళ్లీ పరిస్థితి మొదటికి వచ్చింది. పిఠాపురం నుంచి హైదరాబాదుకు పదికి పైగా ప్రైవేటు బస్సులు నడుస్తున్నాయి. నిత్యం పదుల సంఖ్యలో, పండుగ సమయాల్లో వందలో ప్రయాణికులు వీటి ద్వారా రాకపోకలు సాగిస్తున్నారు. ఇక్కడ పరిస్థితిని స్వయంగా పర్యవేక్షించిన అప్పటి ఎండీ సాంబశివరావు కాకినాడ నుంచి హైదరాబాదు వెళ్లే ఆర్టీసీ బస్సుల్లో సగం పిఠాపురం మీదుగా నడపాలని ఆదేశించారు. వీటిని పాటించకపోగా మొక్కుబడిగా ఎవ్వరికి అనువు కాని సమయంలో ఒక బస్సును నడిపి ప్రయాణికులు ఎక్కడం లేదంటూ రద్దు చేశారు.

మొక్కుబడిగా పాదగయ వద్ద హాల్టు కల్పించి..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, పిఠాపురం ఎమ్మెల్యేగా ఉన్న పవన్‌కల్యాణ్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో ఆర్టీసీ అధికారుల్లో కలవరం మొదలైంది. తమ తప్పిదాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నాలు ప్రారంభించారు. పిఠాపురం పట్టణంలోనుంచి ఎక్స్‌ప్రెస్ సర్వీసులు వెళ్లే అంశాన్ని పక్కనబెట్టి కాకినాడ-విశాఖ మధ్య తిరిగే నాన్‌స్టాప్ సర్వీసులకు పిఠాపురం పాదగయ వద్ద హాల్టు కల్పిస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు ప్రకటించారు. ఇప్పటికే ప్రజాదరణ ఉన్న పిఠాపురం-కాకినాడ, కత్తిపూడి-కాకినాడ, తుని-రాజమండ్రి, ఉప్పాడ-రాజమండ్రి, గొల్లప్రోలు-కాకినాడ సర్వీసుల రద్దుతో పాటు గ్రామీణ ప్రాంతాల సర్వీసులను నిలిపివేసిన అంశం ఎక్కడ ప్రస్తావనకు వస్తుందోనని నాన్‌స్టాప్ సర్వీసులకు హాల్టు కల్పిస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు హడావుడి చేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నాన్‌స్టాప్‌తోపాటు ఒకటి, రెండు ఎక్స్‌ప్రెస్‌లు మినహా మిగిలినవి ఆగకపోవడంతో బైపాస్‌రోడ్డులో ప్రయాణికులు పడిగాపులు కాయాల్సి వస్తోంది. కనీసం ఎక్కడా షెల్టర్ లేకపోవడం, పట్టణంలో నుంచి పాదగయ వద్దకు రావడం లేదా వెళ్లడం వ్యయప్రయాసలకు గురిచేస్తున్నదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. పిఠాపురంతోపాటు గతంలో గొల్లప్రోలు పట్టణంలో నుంచి వెళ్లే రామచంద్రపురం, రాజోలు, తుని, కాకినాడ ఆర్టీసీ డిపోల ఎక్స్‌ప్రెస్ సర్వీసులకు పూర్తిగా హాల్టు తొలగించారు. దీనితో పిఠాపురం, గొల్లప్రోలు ప్రాంతాల ప్రజలు ఎక్స్‌ప్రెస్‌లు ఎక్కాలంటే కాకినాడ లేదా అన్నవరం వెళ్లాల్సి వస్తున్నదని పలువురు చెబుతున్నారు. ఆర్టీసీ అధికారులు ఇప్పటికైనా వాస్తవ పరిస్థితులు తెలుసుకుని పిఠాపురం పట్టణంలో నుంచి అన్ని రకాల ఎక్స్‌ప్రెస్ సర్వీసులు వెళ్లేలా చర్యలు తీసుకోవడంతో పాటు హాల్టులు కల్పించాలని, హైదరాబాదు సర్వీసులపై దృష్టి పెట్టాలని పలువురు కోరుతున్నారు.



కాకినాడలో 'స్వచ్ఛతా హీ సేవా'పై మానవహారంగా ఏర్పడి అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

'స్వచ్ఛతాహీ సేవా' కార్యక్రమాలు ప్రారంభం

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 17: జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలోని స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా పంచాయతీ, జడ్పీ, వైద్యఆరోగ్యశాఖ అధికారులతో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలు నిర్వహణ విజయవంతంపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఈనెల 17నుంచి అక్టోబరు 2 వరకు మూడు అంశాలపై స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలను సక్రమంగా అమలు చేయాలన్నారు. ఈ నేపథ్యంలో స్వచ్ఛతా భాగిదారి కింద గ్రామాల్లో పరిశుభ్రత, పారిశుధ్య అంశాలపై గ్రామసభలు నిర్వహించడం, విద్యార్థులతో ర్యాలీలు, క్విజ్ పోటీలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ప్రతిజ్ఞ చేయించాలన్నారు. స్వచ్ఛతా హీ సేవా 2024 గోడపత్రికను అధికారులతో కలిసి ఆవిష్కరించారు. డీపీవో భారతి సౌజన్య, డ్వామా పీడీ వెంకటలక్ష్మి, జడ్పీ సీఈవో నారాయణమూర్తి, డీఎంహెచ్‌వో నరసింహనాయక్ పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వో కార్యాలయ ప్రాంగణంలో ప్రతిజ్ఞ

జీజీహెచ్(కాకినాడ), సెప్టెంబరు 17: కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలతో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జె.నరసింహనాయక్ సిబ్బంది అందరితో మంగళవారం ప్రతిజ్ఞ చేయించారు. డీఎంహెచ్‌వో కార్యాలయ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యాలయ సిబ్బందితో కలిసి మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. డీఎల్‌వో డాక్టర్ రమేష్, ఇన్‌చార్జ్ డీఐవో డాక్టర్ ఆర్.శ్రీనివాస్‌నాయక్, ఇన్‌చార్జ్ డీపీఎంవో డాక్టర్ సురేఖ, ఏవో జి.దేవకుమారి, డీఎంవో డాక్టర్ ఎస్.భాస్కరరావు, డెమో ప్రసాద్‌రాజు, ఎస్‌వో విజయలక్ష్మి, డీపీహెచ్‌ఎన్‌వో నీలవేణి పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

జీజీహెచ్(కాకినాడ), సెప్టెంబరు 17: నులిపురుగుల నివారణా దినోత్సవం సందర్భంగా జిల్లావ్యాప్తంగా అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో 1 నుంచి 19ఏళ్లలోపు బాల, బాలికలకు ఆల్బెండజోల్(400 ఎంజీ) మాత్రలను మధ్యాహ్న భోజనం తర్వాత జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మింగించారు. ఇందులోభాగంగా కలెక్టర్ షాన్‌మోహన్ ఆధ్వర్యంలో మంగళవారం కాకినాడ, సాంబమూర్తినగర్ బాలయోగి గురుకులం పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లావ్యాప్తంగా 1నుంచి 19ఏళ్లలోపు బాల,బాలికలు 4,72,859మంది ఉండగా వారిలో 92.29శాతం అనగా 4,36,415మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించినట్లు కలెక్టర్ తెలిపారు. మిగిలిన పిల్లలందరికీ ఈనెల 25న జరిగే ఎంవోపీ యూపీ డే రోజున వేసి వంద శాతం ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేస్తామన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్, డీఎల్‌వో డాక్టర్ ఆర్.రమేష్, ఐసీడీఎస్ పీడీ కె.ప్రవీణ, డెమో ప్రసాద్‌రాజు, డీసీపీవో వెంకట్రావ్, డీపీఎంవో డాక్టర్ సురేఖ, ఎంహెచ్‌ఓ డాక్టర్ పృథ్వీచరణ్, డీపీవో సౌజన్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

స్వల్పంగా తగ్గిన మిగులు జలాలు విడుదల

పిఠాపురం/గొల్లప్రోలు, సెప్టెంబరు 17: ఏలేరు రిజర్వాయర్‌నుంచి మిగులు జలాలు విడుదల మంగళవారం స్వల్పంగా తగ్గింది. రెండురోజులుగా ఇన్‌ఫ్లోస్ తగ్గిన నేపథ్యంలో అవుట్‌ఫ్లోస్‌ను తగ్గించాలని ప్రాజెక్టు అధికారులు నిర్ణయించారు. ఇన్‌ఫ్లోస్‌కు అనుగుణంగా, భవిష్యత్తులో తుఫాన్ హెచ్చరికలను దృష్టిలో ఉంచుకుని మంగళవారం ఉదయం 6గంటల వరకూ ఏలేరు రిజర్వాయర్ నుంచి 5,875క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా, తదనంతరం దాన్ని 4,875 క్యూసెక్కులకు తగ్గించారు. ఎగువ ప్రాంతాలనుంచి ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లోస్ 3,076 క్యూసెక్కులుగా ఉన్నాయి. రెండురోజులుగా ఇదే స్థాయిలో ఉండడంతో నీటి విడుదలను తగ్గించాలని నిర్ణయం తీసుకున్నారు. ఏలేరు రిజర్వాయర్‌లో నీటిమట్టం 85.49మీటర్లకు, నీటి నిల్వలు 21.94 టీఎంసీలకు తగ్గాయి. రిజర్వాయర్ నుంచి నీటి విడుదల తగ్గించిన నేపథ్యంలో మంగళవారం సాయంత్రానికి గండ్ల నుంచి పొలాల్లోకి నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టింది. ఇప్పటికి ముంపులో ఉన్న పొలాల్లో నుంచి నీరు ఇదే గండ్ల ద్వారా మళ్లీ కాలువల్లోకి వెళ్తున్నాయి. నీటి విడుదలను మరింత తగ్గిస్తే పొలాల్లో ముంపు మరింత తగ్గే అవకాశం ఉంది. కాగా పిఠాపురం, గొల్లప్రోలు మండలాల్లోని పంటపొలాల్లో ఇసుకమేటలు వేసిన పంటపొలాలను రెవెన్యూ, ఇతర శాఖల సిబ్బంది పరిశీలించారు. రెండు మండలాల్లో 100 ఎకరాలకు పైగా పొలాల్లో ఇసుక మేటలు వేసినట్లు గుర్తించారు.

మెలకువలోనే ఉంచి.. శస్త్రచికిత్స

- బ్రహ్మానందం కామెడీ సీన్లు చూపించి సాఫీగా నిర్వహణ
- జీజీహెచ్‌లో అరుదైన శస్త్రచికిత్స

జీజీహెచ్(కాకినాడ), సెప్టెంబరు 17: మెలకువగా ఉండగానే రోగికి తనకు ఇష్టమైన సినిమా క్లిప్పింగ్‌ను చూపిస్తూ కాకినాడ జీజీహెచ్ న్యూరోసర్జరీ వైద్యులు అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. తొండంగి మండలం ఎ.కొత్తపల్లికి చెందిన 55ఏళ్ల అప్పన్న అనంతలక్ష్మి ఏడాదికాలంగా కుడికాలు, కుడిచెయ్యి లాగేస్తూ బాధపడుతోంది. ఈ క్రమంలో ఆమె పలు ప్రైవేటు ఆస్పత్రులు తిరగ్గా అక్కడ శస్త్రచికిత్స పడుతుందని, చాలా ఖర్చవుతుందని చెప్పడంతో ఆమెకు అంత ఖర్చు పెట్టే ఆర్థిక స్థోమత లేక జీజీహెచ్‌ను ఆశ్రయించింది. ఈనెల 11న జీజీహెచ్ న్యూరోసర్జరీ విభాగంలో చేరింది. అక్కడ పలు వైద్యపరీక్షలు నిర్వహించిన వైద్యులు ఆమెకు మెదడులో ఎడమ వైపున 3.3:2.7 సెంటిమీటర్ల పరిమాణంలో ట్యూమర్ ఉందని గుర్తించారు. సర్జరీ చేయకుండా వదిలేస్తే కుడి వైపు పక్షవాతం వచ్చే ప్రమాదం ఉందన్న నేపథ్యంలో శస్త్రచికిత్సకు సిద్ధం చేశారు. ఈ క్రమంలో మత్తు ఇవ్వకుండానే ఆమె ఇష్టపడే బ్రహ్మానందం కామెడీ సీన్లను సెల్‌ఫోన్‌లో చూస్తుండగా ఆహ్లాదభరితంగా ఉన్న సమయంలో ఆమెకు క్రైనీయాటమి(మెలకువగా ఉండగానే శస్త్రచికిత్స)ను ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించారు. ఆమె త్వరితగతిన కోలుకోవడంతో ఆ వైద్యబృందం సంతోషం వ్యక్తం చేసింది. అనంతలక్ష్మి కుటుంబసభ్యులు వైద్యబృందానికి కృతజ్ఞతలు తెలిపారు. శస్త్రచికిత్స నిర్వహించిన డాక్టర్ విజయశేఖర్, డాక్టర్ కోదండగిరి, అనస్తీషియా హెచ్‌వోడీ డాక్టర్ విష్ణువర్ధన్ బృందాన్ని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి, డీఎంఈ డాక్టర్ నరసింహం అభినందించారు.



శస్త్రచికిత్స సమయంలో బ్రహ్మానందం కామెడీ చూస్తున్న అనంతలక్ష్మి

ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గృహాలు అందజేత

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 17: జిల్లాలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ 2.0 పథకం కింద ప్రభుత్వం మంజూరు చేసిన గృహాలను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. ఒడిశాలో ఈ గృహాలను ప్రధాని మోదీ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. కలెక్టరేట్‌నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నకలెక్టర్ మాట్లాడుతూ 1625 గృహాలను పూర్తిచేసి అప్పగించామన్నారు.

ప్రజా ఫిర్యాదులు పరిష్కారించాలి: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 17: ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో అందిన అర్జీల సత్వర పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో మంగళవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం జరిగింది. వివిధ అంశాలకు చెందిన 174 అర్జీలు అందాయన్నారు. డీఆర్వో తిప్పేనాయక్, డీఆర్డీఏ పీడీ శ్రీరమణి, సీపీవో త్రినాథ్ పాల్గొన్నారు.

రేషన్ గడువు పెంపు

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 17: ప్రభుత్వ చౌకధరలు దుకాణాల్లో సరకు ఇచ్చే గడువును మరో మూడురోజులు పెంచినట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి ఎంవీ ప్రసాద్ తెలిపారు. ఈనెల 20వతేదీ వరకు రేషన్‌కార్డుదారులు సరుకులు పొందవచ్చునని వెల్లడించారు.



సహజ పచ్చదనం కనిపించేలా ఏర్పాటుచేసిన ట్రాప్ బోను

హైవే దాటిన చిరుత పులి

దివాన్‌చెరువు, సెప్టెంబరు 17: దివాన్‌చెరువు అటవీ ప్రాంతం మధ్యలో సోమవారం రాత్రి సుమారు తొమ్మిది గంటల ప్రాంతంలో చిరుత పులి మహా పుష్కర వనం వైపు నుంచి రిజర్వ్ ఫారెస్టు వైపు రోడ్డు దాటుతుండగా హైవేపై వెళ్లే వారు గమనించారని తూర్పు గోదావరి జిల్లా అటవీ శాఖాధికారి ఎస్.భరణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. లాలాచెరువు నుంచి ఆటోనగర్ హైవేపై ఇరువైపులా ప్రయాణించే వాహనచోదకులు గమనిస్తూ ప్రయాణించాలని కోరారు. సీసీ, ట్రాప్ కెమెరాల్లో మంగళవారం చిరుత పులి కదలికలు కనిపించలేదన్నారు. అదనపు బోనులు అమర్చి చిరుత పులిని పట్టుకునేందుకు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నామని తెలిపారు. నివాస ప్రాంతాల్లో చిరుత సంచరిస్తున్నట్టు నిర్ధారణ కాలేదన్నారు. ప్రస్తుతం మూసి ఉన్న పుష్కర వనాన్ని చిరుత సంచారం నేపథ్యంలో మరికొన్ని రోజులు మూసి ఉంచనున్నట్టు డీఎఫ్‌వో చెప్పారు.



గణనాథునికి మహా నైవేద్యం

తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మెరక వీధిలోని వాటర్ ట్యాంకు వద్ద ఏర్పాటు చేసిన గణనాథునికి భక్తులు మంగళవారం భారీ నైవేద్యం సమర్పించారు. ఉత్సవాల్లో 11వ రోజున లక్ష్మీగణపతికి ప్రత్యేక పూజలు చేశారు. 108 రకాల స్వీట్లు, పిండి వంటలను నైవేద్యం పెట్టారు. ఈ నెల 23న స్వామివారి లడ్డూ ప్రసాదం వేలం, అన్నదానం, గణపతి శోభాయాత్ర జరుపుతామని నిర్వాహకులు తెలిపారు.

- కొవ్వూరు

ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో
రేపటి నుంచి అండర్-19 ఆటల పోటీలు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పాఠశాల ఆటల ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్థాయి అండర్-19 ఆటల పోటీలను గురువారం నుంచి నిర్వహిస్తామని ఎస్‌జీఎఫ్ అండర్-19 జిల్లా అధ్యక్షుడు, జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి జేవీఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, జిల్లా ఉపాధ్యక్షుడు, ఆర్ఐవో ఎన్ఎస్‌వీఎల్ నరసింహం తెలిపారు. 2006 జనవరి 1 తర్వాత జన్మించిన వారు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన వారిని రాష్ట్రస్థాయికి పంపిస్తారని చెప్పారు. మరిన్ని వివరాలకు కార్యదర్శి శివరామకృష్ణను 9848176986 నెంబరులో సంప్రదించాలని సూచించారు. షెడ్యూల్ ఇలా... 19న రామచంద్రపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బాస్కెట్ బాల్, సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, షటిల్ బ్యాడ్మింటన్, కరాటే, టేబుల్ టెన్నిస్ (కన్వీనరు మొబైల్: 9490300105), కాకినాడ డీఎస్ఏ మైదానంలో 21న ఫుట్‌బాల్, జూడో, స్విమ్మింగ్, తైక్వాండో, యోగా, రెజ్లింగ్, 29న వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, బాక్సింగ్, జిమ్నాస్టిక్స్, వచ్చే నెల 1న ఖోఖో, హాకీ, ఫెన్సింగ్, రైఫిల్ షూటింగ్, సాఫ్ట్ టెన్నిస్, 30న పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆర్చరీ, రగ్బీ (కాంటాక్ట్ మొబైల్: 9866311539), వచ్చే నెల 16న మండపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో టెన్నికాయిట్, త్రోబాల్, బాల్ బ్యాడ్మింటన్, నెట్‌బాల్ (కాంటాక్ట్ మొబైల్: 8142810810), 19న జి.మామిడాడలోని ఫ్యామిలీ క్లబ్‌లో వాలీబాల్, కబడ్డీ, చెస్ (కాంటాక్ట్ మొబైల్: 9866400999), 30న కాకినాడలోని పీఆర్ డిగ్రీ కళాశాల, ఆర్ఎంసీ మైదానాల్లో అథ్లెటిక్స్, క్రికెట్, లాన్ టెన్నిస్, హ్యాండ్‌బాల్ (కాంటాక్ట్ మొబైల్: 9866311539) పోటీలు జరుగుతాయి.

పెద్దాపురం 'నవోదయ'లో ప్రవేశానికి
ఆన్‌లైన్ దరఖాస్తు గడువు పెంపు

పెద్దాపురం, సెప్టెంబరు 17: జవహర్ నవోదయ విద్యాలయలో 2025-26 విద్యా సంవత్సరంలో ఆరవ తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్ దరఖాస్తు గడువును పెంచినట్టు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.రామకృష్ణయ్య తెలిపారు. నవోదయ విద్యాలయ సమితి ఆదేశాల మేరకు ఈ నెల 23వ తేదీ వరకు గడువు పెంచామని తెలిపారు. వచ్చే సంవత్సరం జనవరి 18న ప్రవేశ పరీక్ష జరుగుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

విస్ఫోటంపై...

- ఫోరెన్సిక్ నిపుణుల బృందం పరిశీలన
- పలు ఆధారాలు సేకరణ
- పేలని గ్యాస్ సిలిండర్లు
- ఐసీయూలో ముగ్గురికి కొనసాగుతున్న చికిత్స



పేలుడు ధాటికి ఫర్లాంగు దూరంలో పడ్డ శకలాలను గుర్తించి ఫొటోలు తీస్తున్న ఫోరెన్సిక్ నిపుణులు





సంఘటనా స్థలంలో ఆధారాలు సేకరిస్తున్న ఫోరెన్సిక్ నిపుణుల బృందం



రామాలయం గేటుకు వేసిన తాళం అలాగే ఉండగా.... పక్కనే పడ్డ సైకిల్‌పై గుర్తించిన పొటాషియం క్లోరైడ్

అమలాపురం టౌన్, సెప్టెంబరు 17: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణ శివారు రావులచెరువులో జరిగిన విస్ఫోటం ఘటనపై విచారణను వేగవంతం చేశారు. విజయవాడ నుంచి వచ్చిన ఫోరెన్సిక్ నిపుణుల బృందంతో పాటు జిల్లా క్లూస్ టీమ్ సభ్యులు పోలీసులతో కలిసి మంగళవారం సంఘటనా స్థలంలో పలు ఆధారాలను సేకరించారు. విస్ఫోటం ధాటికి ఫర్లాంగు దూరంలో పంట చేల మధ్య ఎక్కడో పడ్డ శకలాలను సైతం గుర్తించి వాటిని ఫొటోలు తీశారు. భవనం కుప్పకూలిపోయేంత స్థాయిలో విస్ఫోటం జరిగినప్పుడు ఆ ఇంట్లో పేలుడు పదార్థాలు ఎంతమేర ఉన్నాయో గుర్తిస్తున్నారు. విజయవాడ నుంచి వచ్చిన ఫోరెన్సిక్ అసిస్టెంట్ సైంటిఫిక్ ఆఫీసర్ ఎన్.ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది ఘటనా స్థలంలో అణువణువూ పరిశీలించారు. అంత పెద్ద ఎత్తున పేలుడు సంభవించినప్పటికీ ఆ ఇంట్లో ఉన్న రెండు గ్యాస్ సిలిండర్లు ఏమాత్రం చెక్కుచెదరకుండా శిథిలాల కింద ఉండడాన్ని గుర్తించి వాటిని బయటికి తీశారు. దీంతో గ్యాస్ సిలిండర్లు పేలడం వల్ల ప్రమాదం జరిగిందన్న వాదనకు ఫుల్‌స్టాప్ పడింది. ఘటనా స్థలంలో పొటాషియం క్లోరైడ్, పొటాషియం నైట్రేట్‌తో పాటు వివిధ రకాల కెమికల్స్‌ను, పేలుడు సామగ్రిని గుర్తించి శాంపిల్స్ సేకరించారు. పేలుడు ధాటికి ఎదురుగా ఉన్న రామాలయం గేటు తాళం వేసింది వేసినట్టుగా ఉండగా ఇనుప గెడ విడివడిపోవడంతో ప్రమాదం ఏ స్థాయిలో జరిగిందో గుర్తిస్తున్నారు. చిత్రమేమిటంటే ప్రమాదం జరగడానికి గంటముందు ఇంటి యజమాని గొవ్వాల నాగేశ్వరరావు మందుగుండు సామగ్రికి అవసరమైన పొటాషియం క్లోరైడ్‌ను సైకిల్‌పై తీసుకువచ్చాడు. ప్రమాదం అనంతరం పొటాషియం క్లోరైడ్ బ్యాగ్ సైకిల్‌కే ఉండిపోవడాన్ని మరుసటి రోజున గానీ ఎవరూ గుర్తించలేకపోయారు. సేకరించిన శాంపిల్స్‌ను విజయవాడ తరలించినట్టు అధికారులు తెలిపారు.

ప్రమాద కారణాలపై పోలీసుల ఆరా...

గ్యాస్ సిలిండర్లు చెక్కు చెదరలేదు. అయితే ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై పట్టణ సీఐ పి.వీరబాబు ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. సంఘటనా సమయంలో ఇంట్లో భార్యభర్తలైన గొవ్వాల నాగేశ్వరరావు, నాగలక్ష్మి, కుమారుడు యల్లీష్‌రాజుతో పాటు యానాంకు చెందిన కుమార్తె కట్టా వేణు, మనుమడు వెంకట్ ఉన్నారు. నాగేశ్వరరావు దంపతులతో పాటు కుమారుడి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో కిమ్స్ ఆసుపత్రిలో ఐసీయూలో ఉంచి చికిత్స చేస్తున్నారు. నాగలక్ష్మి తలకు ఉదయం ఆపరేషన్ నిర్వహించారు. కుమార్తె వేణు, మనుమడు నుంచి ఆధారాలు సేకరించేందుకు పోలీసులు పలు విధాలా ప్రయత్నించారు. ప్రమాదం జరగడానికి ముందు ఎవరైనా మతాబులు వంటివి ఏమైనా ఇంట్లో కాల్చారా అన్న దానిపై ఆరా తీస్తున్నారు. మందుగుండు సామగ్రి తయారీకి అవసరమైన సరుకును ఎవరు విక్రయిస్తున్నారు. ఇటీవలి కాలంలో ఎంతమేర సరుకు కొనుగోలు చేశారు అన్న అంశంపై పోలీసులు దృష్టి సారించారు. పెద్ద మొత్తంలోనే పొటాషియం క్లోరైడ్, నైట్రేట్ కొనుగోలు చేసినట్టు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు. వాటితో పాటు బాణాసంచా సామగ్రి కూడా ఇంట్లో ఉన్నట్టు భావిస్తున్నారు. ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ ఘటనా స్థలాన్ని సందర్శించి బాధితులను పరామర్శించారు. కుటుంబ సభ్యులు ముగ్గురు మినహా మిగిలిన అందరి ఆరోగ్య పరిస్థితి మెరుగ్గానే ఉందని వైద్యులు చెప్పారు.

ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో 4వ విడత ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 17: కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లోని ప్రభుత్వ ఐటీఐలు, కాకినాడ, జగ్గంపేట ప్రైవేట్ ఐటీఐల్లో 2024-25 సంవత్సరానికి మిగిలిన సీట్లలో ప్రవేశానికి నాలుగో విడత దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, కాకినాడ, కోనసీమ జిల్లాల కన్వీనర్ ఎం.వేణుగోపాలశర్మ తెలిపారు. ఐటీ ఐ.ఏపీ.జీఓవి.ఇన్ వెబ్‌సైట్‌లో ఈ నెల 26వ తేదీ రాత్రి 11.59 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ సెంటర్లో అభ్యర్థి ఏ ఐటీఐలో చేరదలిచాడో ఆ ఐటీఐలను తప్పనిసరిగా ఆన్‌లైన్ అప్లికేషన్‌లో ఎంపిక చేసుకోవాలి. మొదటి, రెండు, మూడవ విడతల్లో ఐటీఐ సీట్లు రాని అభ్యర్థులు కూడా తప్పనిసరిగా నాల్గవ విడత రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులంతా దగ్గర్లో గల ప్రభుత్వ, ప్రైవేటు ఐటీ ఐల్లో ఈ నెల 27వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలలోపు ఒరిజినల్ సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకుని అప్రూవ్ చేసుకోవాలి. మరిన్ని వివరాలకు 0884-2348182, 9701215511 నెంబర్లలో సంప్రదించాలి.

నిధుల గోల్‌మాల్ వ్యవహారంలో
మరో ఇద్దరికి షోకాజ్ నోటీసులు

అన్నవరం, సెప్టెంబరు 17: అన్నవరం దేవస్థానం దత్తత దేవాలయమైన కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో సుమారు రూ.16 లక్షల నిధుల గోల్‌మాల్ వ్యవహారంలో మరో ఇద్దరికి షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. ఈవో రామచంద్రమోహన్ ఇప్పటికే ముగ్గురిని సస్పెండ్ చేసి ఇద్దరికి షోకాజు నోటీసులు ఇచ్చారు. అప్పట్లో అన్నవరం ఉప కమిషనర్‌గా పనిచేసిన డీఎల్‌వీ రమేష్‌బాబు, ఏఈవో వై.శ్రీనివాసరావులకు తాజాగా మంగళవారం దేవదాయ కమిషనర్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఉప కమిషనర్‌పై చర్యలు తీసుకునే అధికారం దేవదాయ కమిషనర్‌కు మాత్రమే ఉంది. ఈ వ్యవహారంపై ఈవో రామచంద్రమోహన్ దేవదాయ కమిషనర్‌కు నివేదిక ఇవ్వగా తాజాగా ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి.

కామాంధ గురువుపై విచారణ!

- ప్రధానోపాధ్యాయుడు చంద్రు రామకృష్ణపై సస్పెన్షన్ వేటు
- విధుల నుంచి తొలగిస్తూ ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం ఆదేశాలు
- లైంగిక వేధింపులను జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ దృష్టికి తెచ్చిన 8 మంది విద్యార్థినులు

రంపచోడవరం, సెప్టెంబరు 17: అల్లూరి సీతారామరాజు జిల్లా గంగవరం మండలంలోని ఓ ఆశ్రమ బాలికల విద్యాలయంలో సుమారు ఎనిమిది మంది గిరిజన విద్యార్థినులపై ప్రధానోపాధ్యాయుడి లైంగిక వేధింపుల ఘటనపైమంగళవారం విచారణ ప్రారంభమైంది. ఈ ఘటనపై మీడియాలో కథనాలు రావడంతో అల్లూరి జిల్లా కలెక్టరు దినేష్‌కుమార్, ఎస్పీ అమిత్ బర్దర్ వేగంగా స్పందించి విచారణతో పాటు తగు చర్యలకు సూచనలు చేశారు. ఈ మేరకు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం ఐసీడీఎస్ అధికారి ఒకర్ని ప్రాథమిక విచారణకు పంపించారు. పూర్తిస్థాయిలో రహస్య ప్రాథమిక విచారణ జరిపించి నివేదిక ఆధారంగా హెచ్ఎం చంద్రు రామకృష్ణను విధుల నుంచి సస్పెండ్ చేసినట్టు పీవో చెప్పారు. మహిళా పోలీసులు కూడా విద్యార్థినుల నుంచి వేధింపుల వివరాలు నమోదు చేసుకున్నారు. ఎనిమిది మంది విద్యార్థినుల్లో ముగ్గురు పదవ తరగతి, ఐదుగురు ఇంటర్మీడియట్ చదువుతున్నారు. సదరు ప్రధానోపాధ్యాయుడు వేధించిన వైనాన్ని ఐసీడీఎస్ అధికారులకు, మహిళా పోలీసులకు వివరించారు. ఓ విద్యార్థినిని అయితే తాను ప్రేమిస్తున్నాని కూడా చెప్పి వేధించేవాడు. బయటకు చెప్పుకోలేని పలు విషయాలు ఈ వేధింపుల్లో దాగి ఉన్నాయి. శాఖాపరమైన విచారణలు సాగుతుండగా గిరిజన సంక్షేమ విద్యాలయాల స్థితిగతులపై పరిశీలన జరిపేందుకు వచ్చిన రంపచోడవరం ఇన్‌చార్జి మేజిస్ట్రేటు బాబు ముందు కూడా బాధిత విద్యార్థినులు తమపై జరిగిన లైంగిక వేధింపులను ఏకరువు పెట్టినట్టు సమాచారం. ఈ ఘటన తమ దృష్టికి వచ్చిందని, ఎవరి నుంచైనా పిర్యాదు అందితే కేసు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తామని గంగవరం ఎస్ఐ రామకృష్ణ చెప్పారు.



ఆసుపత్రిలో విద్యార్థినులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో, సబ్ కలెక్టరు

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి చర్యలు

రంపచోడవరం, సెప్టెంబరు 17: విద్యార్థుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ క్రమశిక్షణ చర్యలకు గురై రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను మంగళవారం ఆయన సబ్ కలెక్టరు కల్పశ్రీతో కలిసి పరామర్శించారు. విద్యార్థులు పలు సమస్యలను ఐటీడీఏ పీవోకు విన్నవించారు. కళాశాలలో జరిగిన ఘటనపై విచారణకు గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టరుతో పాటు మరి కొంత మందితో కమిటీని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. సబ్ కలెక్టరు కల్పశ్రీ మాట్లాడుతూ విద్యార్థులకు సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్ఎం వెంకటఇందిర, వైద్యాధికారులు క్రాంతికిరణ్, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పీఆర్వో కృష్ణారావుకు విరాళం అందజేస్తున్న దాత

సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి రూ.6 లక్షలు విరాళం

అన్నవరం, సెప్టెంబరు 17: రత్నగిరిపై ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి మంగళవారం హైదరాబాద్‌కు చెందిన పోతుగుంట శ్రీలక్ష్మి రూ.6 లక్షలు విరాళం సమర్పించారు. ఈ మొత్తాన్ని దేవస్థానం పీఆర్వో కృష్ణారావుకు అందజేసింది. దాతను ఆయన అభినందించి ప్రత్యేక దర్శనం చేయించి స్వామివారి ప్రసాదం అందజేశారు.



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో 'శ్రీప్రకాష్' అధినేత నరసింహారావు

జాతీయ స్థాయి పోటీలకు
'శ్రీప్రకాష్' విద్యార్థుల ఎంపిక

తుని రూరల్, సెప్టెంబరు 17: ఈ నెల 14 నుంచి 16 వరకు సీబీఎస్ఈ బోర్డు ఆధ్వర్యంలో నల్గొండలోని ఏకశిలా అడ్వాన్స్‌డ్ లెర్నింగ్ స్కూల్లో జరిగిన క్లస్టర్-7 (ఆంధ్ర, తెలంగాణ) అథ్లెటిక్స్ పోటీల్లో శ్రీప్రకాష్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 4X400 మీటర్ల రిలే పరుగులో అండర్-19 విభాగంలో ప్లస్ 1, ప్లస్ 2 వై.జయసత్యకుమార్, ఆదిత్యకుమార్, ఎల్.పూర్ణ శ్యామ్‌నాయుడు, శాశ్వత్ ప్రేమ్, ఎండీ సునీల్‌కుమార్ ప్రథమస్థానంలో నిలిచారు. జావలిన్ త్రోలో ఆదిత్యకుమార్ 40.90 మీటర్లతో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించడమే కాకుండా అక్టోబరు 6 నుంచి 8వ తేదీ వరకు వారాణసీలోని సెయింట్ అతులానంద్ కాన్వెంట్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. 5000 మీటర్ల పరుగులో ఎండీ సునీల్‌కుమార్ కాంస్య పతకం సాధించాడని ప్రిన్సిపాల్ తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, కోచ్ శ్రీరామాంజనేయులు తదితరులు అభినందించారు.

దసరా, దీపావళి పర్వదినాలకు
21 వారాంతపు 'పూజ' ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు

సామర్లకోట, సెప్టెంబరు 17: రానున్న దసరా, దీపావళి పండగ రోజుల్లో ప్రయాణికులకు మరింత మెరుగైన ప్రయాణ సదుపాయాలు కల్పించేందుకు దక్షిణ మధ్య రైల్వే సామర్లకోట మీదుగా విశాఖ-బెంగళూరు-విశాఖ మధ్య నవంబరు 25 వరకు 21 వారాంతపు 'పూజ' ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుపుతున్నట్టు ఈస్ట్‌కోస్ట్ రైల్వే ఉన్నతాధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

విశాఖపట్నం-బెంగళూరు (08543) ప్రత్యేక వారాంతపు ఎక్స్‌ప్రెస్ విశాఖలో ప్రతి ఆదివారం సాయంత్రం 3.55 గంటలకు బయల్దేరుతుంది. దువ్వాడ, యలమంచిలి మీదుగా సాయంత్రం 5.54 గంటలకు సామర్లకోట, 6.38 గంటలకు రాజమహేంద్రవరం, అక్కడి నుంచి నిడదవోలు, తణుకు, భీమవరం, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్పాడి, జోలార్‌పేట, కుప్పం, బంగారుపేట, కృష్ణరాజపురం మీదుగా సోమవారం మధ్యాహ్నం 12.30 గంటలకు బెంగళూరు చేరుతుంది. ఈ రైలు సెప్టెంబరు 22, 29, అక్టోబరు 6, 13, 20, 27, నవంబరు 3, 10, 17, 24 తేదీల్లో ప్రతి ఆదివారం బయల్దేరుతుంది.

బెంగళూరు-విశాఖ (08544) ప్రత్యేక వారాంతపు ఎక్స్‌ప్రెస్ రైలు సోమవారం సాయంత్రం 3.55 గంటలకు బెంగళూరులో బయల్దేరి కృష్ణరాజపురం, బంగారుపేట, కుప్పం, జోలార్‌పేట, కాట్పాడి, రేణిగుంట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం, తణుకు, నిడదవోలు మీదుగా ఉదయం 8.33 గంటలకు రాజమహేంద్రవరం, 9.22 గంటలకు సామర్లకోట, యలమంచిలి, దువ్వాడ మీదుగా మంగళవారం మధ్యాహ్నం 1.30 గంటలకు విశాఖపట్నం చేరుతుంది. ఈ రైలు సెప్టెంబరు 16, 23, 30, అక్టోబరు 7, 14, 31, 28 నవంబరు 4, 11, 18, 25 తేదీల్లో ప్రతి సోమవారం బెంగుళూరులో బయల్దేరుతుంది.

ఈ రైళ్లలో ప్రయాణించదలచిన వారు ఆయా స్టేషన్లలోని బుకింగ్ కార్యాలయాల వద్ద రిజర్వేషన్ టిక్కెట్లు పొందవచ్చని రైల్వే ఉన్నతాధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

అల్లూరి యువజన సంఘం జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు 'పడాల' కన్నుమూత

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 17: అల్లూరి యువజన సంఘం జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు (70) అనారోగ్యంతో మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనకు తొలుత రాజహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలోను, అటుపై దేవీచౌక్ సమీపంలోని బుద్ధుడు ఆసుపత్రిలోను చికిత్స అందించారు. అయితే షుగరు వ్యాధి కారణంగా ఆయన కాలు పాదం దెబ్బతినడంతో పరిస్థితి విషమంగా మారింది. రాజమండ్రి ప్రెస్‌క్లబ్ సభ్యులు, బంధువులు కలిసి అంబులెన్సులో మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం నుంచి కాకినాడ జనరల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఆయన కాలి వేళ్లను శస్త్ర చికిత్స చేసి తొలగించారు. అయినా బాగోలేదు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి 7 గంటలకు పడాల తుది శ్వాస విడిచారు. పడాల స్వస్థలం తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని గోరక్షణపేట. ఆయన తండ్రి పడాల రామారావు శతాధిక గ్రంథకర్త, కమ్యూనిస్ట్ ఉద్యమ నేత. తండ్రి స్ఫూర్తితో వీరభద్రరావు నిరంతరం అభ్యుదయ భావాలతో పోరాడారు. కోస్తా సమయం పత్రిక ఎడిటర్‌గా విప్లవ పార్టీల కరపత్రాలను తన ప్రింటింగ్ ప్రెస్‌లో ముద్రించి అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మన్యంవీరుడు అల్లూరి సీతారామరాజు పేరును రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతానికి పెట్టాలని తనదైన శైలిలో ప్రభుత్వాలను ప్రభావితం చేసిన యోధుడు పడాల. అల్లూరి జీవితం కోసం అనేక పరిశోధనలు చేసి పుస్తకాన్ని కూడా రచించారు. ఆయనకు భార్య, కుమార్తె, ఇద్దరు కుమారులు. కుమారులిద్దరూ గతంలోనే అనారోగ్యంతో మరణించారు. అయినా ఎక్కడా కుంగిపోకుండా నిరంతరం రాజీలేని జీవన పోరాటం చేశారు. బుధవారం రాజమహేంద్రవరంలో పడాలకు అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఆయన మృతికి ది రాజమండ్రి ప్రెస్‌క్లబ్ ప్రగాఢ సంతాపం ప్రకటించింది. పలువురు జర్నలిస్టులు, రచయితలు సంతాపం తెలిపారు.



పడాల వీరభద్రరావు (పాత చిత్రం)

40 కాసుల బంగారం చోరీ



కిర్లంపూడి, సెప్టెంబరు 17: కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం సోమవరం గ్రామంలో దొంగలు పట్టపగలే చేతివాటం ప్రదర్శించారు. సోమవరానికి చెందిన జ్యోతుల వీర వెంకట సత్యనారాయణ కుటుంబంతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేరని తెలుసుకుని గుర్తు తెలియని దుండగులు ఇంట్లోకి ప్రవేశించి 40 కాసుల బంగారం, నగదు దొంగలించారు. దీనిపై బాధితులు కిర్లంపూడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జగ్గంపేట సీఐ లక్ష్మణరావు, కిర్లంపూడి ఎస్ఐ సతీష్ చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్‌తో వేలిముద్రలు సేకరించారు. పోలీసులు మూడు బృందాలుగా ఏర్పడి నిందితులను పట్టుకునేందుకు తనిఖీలు నిర్వహిస్తున్నారని చెప్పారు.

అల్లర్లు చేస్తే ఉపేక్షించం : డీఎస్పీ

తాళ్లరేవు, సెప్టెంబరు 17: జాతర్లను గ్రామస్తులు ప్రశాంతంగా జరుపుకోవాలని, శాంతి భద్రతలకు విఘాతం కల్పించి అల్లర్లు చేస్తే ఎవ్వరినీ ఉపేక్షించేది లేదని కాకినాడ డీఎస్పీ రఘువీర్ విష్ణు అన్నారు. మంగళవారం రాత్రి కోరింగ పంచాయతీ చిన పెద బొడ్డువెంకటాయపాలెంలో మహాలక్ష్మమ్మ జాతర సందర్భంగా డీఎస్పీ, సీఐ చైతన్యకృష్ణ గ్రామస్తులతో మాట్లాడారు. టీడీపీ నేతలు వాడ్రేవు వీరబాబు, వైదాడి శ్రీనివాసరావు ఉన్నారు.

సంపూర్ణ పారిశుధ్యంతోనే ఆరోగ్యమైన సమాజం

» ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప » స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు » పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు » ర్యాలీలు, ప్రతిజ్ఞలు







పెద్దాపురంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే రాజప్ప, ఏలేశ్వరం: లింగంపర్తిలో టీడీపీ నాయకుల ప్రతిజ్ఞ, పిఠాపురంలో శుభ్రం చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

పెద్దాపురం, సెప్టెంబరు 17: ఆరోగ్యవంతమైన సమాజానికి ప్రతీ ఒక్కరూ తమ తోడ్పాటునందించాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ఆయన పాల్గొని జంక్షన్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ సంపూర్ణ పారిశుధ్యంతోనే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల ద్వారా ప్రజాప్రతినిధులు, ప్రజలను భాగస్వాములను చేసి పట్టణాలు, గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. రహదారులపై చెత్తను చీపుర్లతో ఊడ్చారు. స్వచ్ఛతా హీ సేవా ప్రతిజ్ఞ చేశారు. విద్యార్థులు మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజాసూరిబాబురాజు, మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి, శానిటరీ ఇనస్పెక్టర్ దావీదురాజు, కర్రి వెంకటరమణ, తూతిక రాజు పాల్గొన్నారు. స్థానిక వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో విశ్వకర్మ జయంతి వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. దివిలి గ్రామంలో వినాయక చవితి ఉత్సవాల ముగింపు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కొత్తెం వెంకటశ్రీనివాసరావు (కోటి), మొయిళ్ల కృష్ణమూర్తి, మత్తాల రాజు, ఎగ్గాడ శ్రీను తదితరులు ఉన్నారు..

జేఎన్టీయూకే: మన పరిసరాలు బాగుంటే మనం బాగుంటామని పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతిఒక్కరూ నడుం బిగించాలని ఇన్‌ఛార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ అన్నారు. వర్సిటీలో జేఎన్టీయూకే, యూసీఈకే ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో స్వచ్ఛతాహీ సేవాకార్యక్రమాన్ని వర్సిటీ ప్రధాన గేటు వద్ద నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వీసీ మురళీ కృష్ణ, అతిథులుగా రెక్టార్ కేవీరమణ, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, రాక్ సిరామిక్స్ సీఎండీ నీరజ్ పాల్గొనగా జేఎన్టీయూకే ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ జి.శ్యామ్‌కుమార్ అధ్యక్షత వహించారు.

పిఠాపురం: పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కుంతీమాధవస్వామి కోనేరు వద్ద శుభ్రం చేశారు. అక్కడ పెరిగిపోయిన మొక్కలను తొలగించారు. కమిషనరు ఎం.కనకారావు, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సామర్లకోట: హుస్సేన్‌పురం గ్రామ పంచాయతీ ఆవరణలో ఎంపీడీవో డి.శ్రీలలిత ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలకు ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. స్వచ్ఛ భారత్ ప్రతిజ్ఞను గ్రామస్తులు, అధికారులుతో నిర్వహించారు. జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, పాలకుర్తి శ్రీనుబాబు, తోటకూర శ్రీనువాస్, గుమ్మళ్ళ రామకృష్ణ, సర్పంచ్ మార్ని నాగమణి, చల్లా బుజ్జి పాల్గొన్నారు. పంచాయతీ సిబ్బందిని ముఖ్యఅతిథులు సన్మానించారు. సామర్లకోట మున్సిపాల్టీ ఆధ్వర్యంలో గాంధీబొమ్మ సెంటర్ నుంచి పిఠాపురం రోడ్డు మీదుగా ర్యాలీ, మానవహారాలు నిర్వహించారు. కమిషనర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, చైర్‌పర్సన్ జీ.అరుణ పాల్గొన్నారు.

కార్పొరేషన్: స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్, కాకినాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో భాగంగా కాకినాడలోని కొండయ్యపాలెం ఫ్లై ఓవర్ సమీపంలో ఏర్పాటు చేసిన మానవహారం, పారిశుధ్యంపై అవగాహన కార్యక్రమాలను కమిషనర్ భావన ప్రారంభించారు. విద్యార్థుల మానవహారంలో జిల్లాస్థాయి అధికారులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యమని, ఆరోగ్యమే మహాభాగ్యమన్నారు. విద్యార్థులు, అధికారులు ప్రతిజ్ఞ చేశారు. అదనపు కమిషనర్ కేటీ సుధాకర్, ఎస్ఈ సత్యకుమారి, ఎంహెచ్‌వో పృథ్వీచరణ్ పాల్గొన్నారు.

అన్నవరం: సత్యదేవుడి సన్నిధిలో స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాలు ప్రారంభించారు. హరిహరసదన్, వేదపాఠశాల, శివసదన్ పరిసరాలను శుభ్రపరిచారు. 15 రోజులపాటు ఈ స్పెషల్‌డ్రైవ్ కొనసాగుతుందని ఈవో రామచంద్రమోహన్ పేర్కొన్నారు. 15 రోజులు రత్నగిరి, సత్యగిరి, కొండదిగువ ప్రదేశాలలో నిర్విరామంగా జరపాల్సిన స్వచ్ఛతా కార్యక్రమాలపై ప్రత్యేక సర్క్యులర్ జారీచేశారు. పీఆర్వో కృష్ణారావు, సూపరెంటెండెంట్ బలువు సత్యశ్రీనివాస్ ఉన్నారు.

ప్రత్తిపాడు: ధర్మవరంలో ర్యాలీని సర్పంచ్ బెంతుకుర్తి సుశీల అబ్బాయి ప్రారంభించారు. స్థానిక పెద్దలు బొల్లు కొండబాబు, రామిశెట్టి ప్రసాద్, బొల్లు వెంకటేశ్వరరావు,దాట్ల బుచ్చిబాబు, డిజిటల్ అసిస్టెంట్ మధు, ఆచారి సూరిబాబు పాల్గొన్నారు.

తుని రూరల్: లోవ దేవస్థానంలో ఈవో విశ్వనాథ్ రాజు సిబ్బందితో కలిసి ఆలయ ప్రాంగణ పరిసరాలు పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. ఆలయంలో నాయీబ్రాహ్మణులు భాగస్వాములయ్యారు.

జగ్గంపేట రూరల్: జగ్గంపేట మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పారిశుధ్య సిబ్బందికి యూనిఫామ్‌లు అందించారు. గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. వైస్ ఎంపీపీ కోరుపల్లి నాగలక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో సచివాలయ సిబ్బంది, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీలు ఉన్నారు.

కరప: కరప, పెనుగుదురులో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో జనసేన, టీడీపీ మండలాధ్యక్షులు బండారు మురళి, దేవు వెంకటేశ్వరరావు, డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, కార్యదర్శులు వి.సునీల్‌కుమార్,బి.చంద్రకళ ఉన్నారు.

తాళ్లరేవు: కోరింగ, తాళ్లరేవు, పి.మల్లవరం, గాడిమొగలో పంచాయతీ అధికారులు ర్యాలీలు నిర్వహించారు. విద్యార్థులు, గ్రామస్తులతో ప్రతిజ్ఞలు చేయించారు. టీడీపీ నేతలు వాడ్రేవు వీరబాబు, పొన్నమండ రామలక్ష్మి, ధూళిపూడి వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శులు, వైద్యసిబ్బంది విద్యార్థులున్నారు.

ఏలేశ్వరం: పట్టణ, మండల గ్రామాల్లో ప్రజాప్రతినిధులు ర్యాలీ, ప్రతిజ్ఞ, మానవహారం చేపట్టారు. కార్యక్రమాల్లో నగర పంచాయితీ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి, కౌన్సిలర్ అలమండ చలమయ్య, జ్యోతుల పెదబాబు, చిక్కాల లక్ష్మణరావు, నూకతాటి ఈశ్వరుడు, బూర్లు సత్తిబాబు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు





ప్రత్తిపాడులో పండ్లు అందజేస్తున్న బీజేపీ నాయకులు, సర్పవరంలో కేక్ కోస్తున్న నాయకులు

ప్రత్తిపాడు, సెప్టెంబరు 17: ప్రత్తిపాడులో ప్రధాని మోదీ 77వ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు ఉమ్మడి వెంకట్రావు, బీజేపీ నాయకులు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులు, గర్భిణులకు పండ్లు, రొట్టెలు, పాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రామిశెట్టి సూర్యనారాయణ, కూరాకుల రాజా, పతివాడ వెంకటేశ్వరరావు, డి.సూరిబాబు, నల్లబ్బాయి, మార్ని శివశ్రీనివాస్, సుబ్బారావు, శ్రీను, చంద్రశేఖర్ పాల్గొన్నారు. బీజేపీ కార్యాలయం వద్ద నియోజకవర్గ కన్వీనర్ సింగిలిదేవ్ సత్తిరాజు, మండలాధ్యక్షుడు కందా వీరాస్వామి, అల్లూరి సీతారామరాజు సెంటర్, మార్కెట్ సెంటర్‌లో స్వీట్లు పంచారు. గున్నాబత్తుల రాజబాబు, రాసంశెట్టి రాజా, నక్కా శ్రీను, రామకుర్తి రాజబాబు,చంద్రరావు పాల్గొన్నారు.

సర్పవరం జంక్షన్: సర్పవరం జంక్షన్‌లో బీజేపీ కార్యకర్తల ఆధ్వర్యంలో కేకు కోసి సీట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు పైడా కృష్ణమోహన్, పైడా భవానీ ప్రసాద్, కాళ్ల ధనరాజు, చోడిశెట్టి రమేష్‌బాబు, తుమ్మలపల్లి నారాయణరావు, కంచుమర్తి చినఅప్పాజీ, నారాయణ్‌సింగ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురం: స్థానిక రోటరీ క్లబ్‌లో రక్తదాన శిబిరాన్ని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు తుమ్మల పద్మజ ప్రారంభించారు. దివ్యాంగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు అల్లు ప్రసాద్, దొరయ్య, రవికృష్ణ, సతీష్, అన్నపూర్ణ, నాని పాల్గొన్నారు. జి.రాగంపేటలో ఈశ్రమ్ ఇన్సూరెన్స్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. గొరకపూడి చిన్నయ్యదొర, మోటూరి వీరబాబు,ప్రభాకర్ పాల్గొన్నారు.

సామర్లకోట: పనసపాడు మెడికవర్ ఆసుపత్రి ఆవరణలో నిర్వహించిన రక్తదాన కార్యక్రమానికి పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రశంసా పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. మెడికవర్ ఆసుపత్రికి చెందిన సెంటర్ హెడ్ సుభాకర్, వివిధ విభాగాధిపతులు, పాల్గొన్నారు. ఎమ్మెల్యే చినరాజప్పను ఆసుపత్రి ప్రతినిధులతో ఘనంగా సన్మానించారు.

పిఠాపురం: పిఠాపురంలో బీజేపీ పట్టణాధ్యక్షుడు పసుపులేటి సత్యనారాయణ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు డీవీ సూర్యనారాయణరాజు, గండి కొండలరావు, వాసంశెట్టి శ్రీనివాసరావు, తోట ఏడుకొండలు, బుర్రి మురళీధరరావు, దోనే అచ్యుతరామయ్య, చిట్టా మధు, పోసిన సత్యనారాయణ, కొమ్మినీడి భద్రరావు, పిల్లా ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ సిటీ: భారత ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని కాకినాడ రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ వద్ద జిల్లా బీజేపీ, యువమోర్చా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. 41వ డివిజన్ బీజేపీ ఇన్‌చార్జి కేవీ చలపతిరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో ఎమ్మెల్యే కేక్ కట్ చేసి పంచారు. బీజేపీ కాకినాడ సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జి గట్టి సత్యనారాయణ, అనపర్తి బీజేపీ కన్వీనర్ శివరామకృష్ణంరాజు, నాయకులు వై.మాలకొండయ్య, చిత్ర పాపారావు, కర్రి సత్యనారాయణరాజు, దొడ్డి వీరేంద్ర, సాలగ్రామ లక్ష్మీప్రసన్న, కవికొండల భీమశేఖర్, టీడీపీ నాయకులు దేవదానబాబా ఉన్నారు.

కిర్లంపూడి: కృష్ణవరం టోల్‌గేట్ వద్ద బీజేపీ నాయకులు వాహనదారులకు స్వీట్లు పంపిణీ చేశారు. బీజేపీ మండలాధ్యక్షుడు యడాలి రాంబాబు, అసెంబ్లీ కన్వీనర్ దాట్ల కృష్ణవర్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టా మంగరాజు, అసెంబ్లీ కోకన్వీనర్ కాను సురేష్, ప్రధాన కార్యదర్శి కంటా కాశీవిశ్వనాథం, మండల ఉపాధ్యక్షుడు దొడ్డ అప్పారావు, జ్యోతుల దుర్గాప్రసాద్, బుద్ధ సత్యనారాయణ, కిసాన్ మోర్చ అధ్యక్షుడు మచ్చ వెంకటరమణ తదితరులున్నారు.

ఏలేశ్వరం: యర్రవరంలో సరస్వతీ శిశు మందిర్‌లో విద్యార్థులకు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావు నేతృత్వంలో పెన్నులు, బిస్కట్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. కూరాకుల రాజా, బండారు సూరిబాబు, పతివాడ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కరప: చొల్లంగి అభయాంజనేయస్వామి ఆలయంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ కరప మండలాధ్యక్షుడు రెడ్డి రమణేశ్వర్, నాయకులు పుట్టా వీరప్రసాద్ గాంధీ, ముమ్మిడి పెదకాపు తదితరులు పాల్గొన్నారు.

'పేదవాడి సొంతింటి కల నెరవేర్చాలన్నదే ఆశయం'

కాకినాడ సిటీ, సెప్టెంబరు 17: ప్రతి పేదవాడి సొంతింటి కల నెరవేర్చాలన్నదే కూటమి ప్రభుత్వ ఆశయమని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. పర్లోవపేట పూలే కాలనీలో రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద నూతనంగా నిర్మించిన 17 గృహాలను మంగళవారం ఆయన లబ్ధిదారులతో గృహప్రవేశాలు చేయించారు. అర్బన్ బీఎల్‌సీ పథకం ద్వారా 20 ఇళ్లకు రుణాలు మంజూరు కాగా, పూర్తయిన 17 ఇళ్లకు గృహ ప్రవేశ మహోత్సవం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్‌వీవీ సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్. డీఈఈ సత్యనారాయణరెడ్డి, ఏఈఈ రమణారెడ్డి, విఘ్నేష్, టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, నాయకులు తుమ్మల సునీత రమేష్, వొమ్మి బాలాజీ, తుమ్మల కొండలరావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

'అప్పులఊబిలో కూరుకుపోయిన సెజ్ బాధితులు'

కాకినాడ సిటీ, సెప్టెంబరు 17: కాకినాడ సెజ్ పేరుతో యు.కొత్తపల్లి, తొండంగి మండలాల పరిధిలో భూములు సేకరించి నిర్వాసితులకు ఉపాధి కల్పించకపోవడం వల్ల సెజ్ బాధితులు అప్పులఊబిలో కూరుకుపోయారని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోడి చెంగల్‌రావు ధ్వజమెత్తారు. ఆయా మండలాల సెజ్ బాధితులతో కలెక్టర్‌ను మంగళవారం కలిసి సంతకాలతో కూడిన వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ యు.కొత్తపల్లి మండలంలో 12 గ్రామాలను తొలగించి నిర్వాసితులకు ఉద్యోగాలిస్తామని 2007లో మూలపేటలో నిర్వాసిత కాలనీని నిర్మించి తరలించారని, శాశ్వత ఉద్యోగాలిస్తామని నమ్మించి ఇంతవరకూ ఇవ్వలేదన్నారు. దీంతో వలస కూలీలుగా మారిన నిర్వాసితులు ఉపాధి లేక ప్రైవేటు బ్యాంకులు, మైక్రో ఫైనాన్స్ కంపెనీల వద్ద అప్పులు చేసి వాయిదాలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రైవేటు బ్యాంకుల దందా వల్ల మరోసారి ఇళ్లు కోల్పోయి నిర్వాసితులుగా మారే పరిస్థితి ఏర్పడిందని కలెక్టర్‌కు వివరించగా రెండురోజుల్లో ఆయా బ్యాంకుల సిబ్బందిని పిలిపించి మాట్లాడతానని హామీ ఇచ్చారని చెంగల్‌రావు తెలిపారు.

'పేదల సాగు భూములకు హక్కు పత్రాలివ్వాలి'

ప్రత్తిపాడు, సెప్టెంబరు 17: మండలంలో పేదలు సాగు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సీపీఐ ఎంఎల్ లిబరేషన్, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం కార్యకర్తలు ర్యాలీ, తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. నాయకత్వం వహించిన లిబరేషన్ జిల్లా కార్యవర్గసభ్యుడు మానుకొండ లచ్చబాబు, వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం నాయకుడు తాడి నాగేశ్వరరావు మాట్లాడుతూ మండలంలోని చింతలూరు, పోతులూరు,ధర్మవరం తదితర గ్రామాల్లో గ్రామీణ వ్యవసాయ కూలీలు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు, పాస్‌పుస్తకాలు మంజూరు చేయకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వినతిపత్రాన్ని తహశీల్దార్ సూర్యప్రభకు అందజేశారు. అనుసూరి లక్ష్మీ, రాజాల రత్నం, బొండి కామరాజు, సుబ్బారావు, గండుపల్లి రాజు, వి.ఇ. కామరాజు, జిల్లా గిరిజన సంఘం అధ్యక్షులు రేచుకట్ల సింహాచలం, డి.సత్యనారాయణ పాల్గొన్నారు.

'ప్రజా సమస్యలను పరిష్కరించాలి'

జగ్గంపేట రూరల్, సెప్టెంబరు 17: ప్రజా సమస్యలను పరిష్కరించాలంటూ సీపీఐ ఎంఎల్ పార్టీ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు ఆధ్వర్యంలో జగ్గంపేట తహశీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన వ్యక్తం చేసి తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. అర్జునరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న గిరిజనులందరికీ కుల ధ్రువీకరణ పత్రాలను మంజూరు చేయాలని, నివాస స్థలం ఉండి గృహం నిర్మించుకునే గిరిజనులకు రూ.10లక్షలు హౌసింగ్ లోన్ ప్రకటించాలన్నారు. తక్షణం ఏలేరు ఆధునీకకరణ పనులు పూర్తి చేసి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా రైతులకు పూర్తిస్థాయిలో నీరు అందించాలని కోరారు. జిల్లా కమిటీ సభ్యులు జగ్గంపూడి రాజు, నాగుపల్లి అచ్చారావు, నాగులపల్లి రమణ, వినపర్తి నాగ శేషు, కోరుకొండ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

'ఓజోన్ పొర సంరక్షణ అందరి బాధ్యత'

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 17: సకల జీవరాసులతో పాటూ మానవ జాతి మనుగడకు ఓజోన్ పొరను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఏపీఎస్పీ జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు కె.గాయత్రి అన్నారు. మంగళవారం రమణయ్యపేట ఏపీఎస్పీ హైస్కూల్ ప్లస్ స్కూల్లో విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ ఓజన్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలని జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా కోఆర్డినేటర్ కేసరి శ్రీనివాసరావు కోరారు. ఓజోన్ పొర సంరక్షణ కోసం విరివిగా చెట్లను పెంచాలని ప్రోగ్రామ్ కోఆర్డినేటర్, కాలేజీ ఇన్‌చార్జి కందూకూరి పాల్‌రాజు కోరారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ, ర్యాలీ నిర్వహించారు. ఎస్.చలపతి, ఎస్.శ్రీనివాస్, ప్రకాశ్, సూరిబాబు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుల సంఘం సమావేశం

కాకినాడ రూరల్, సెప్టెంబరు 17: ఏపీ ప్రధానోపాధ్యాయుల సంఘం కాకినాడ జిల్లా యూనిట్ సమావేశాన్ని సంఘ అధ్యక్షుడు ఎం.కూర్మారావు అధ్యక్షతన మంగళవారం కాకినాడలో నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలు, కాంప్లెక్స్‌లు, మండల వనరుల కేంద్రాలకు 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించిన నిధులతో పాటూ 2023-24 విద్యాసంవత్సరపు బకాయిలు వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అన్ని పాఠశాలల్లోనూ విద్యార్థులు కోరుకున్న మాధ్యమంకు అనుమతించాలన్నారు, 10వ తరగతి విద్యార్థులు మార్చి 2025 పరీక్షలను కోరుకున్న మాధ్యమంలోనే రాసేలా వెంటనే ఉత్తర్వులు విడుదలచేయాలని కోరారు. సంఘ ప్రధాన కార్యదర్శి పి.వుల్లయ్య, అదనపు ప్రధాన కార్యదర్శి చెవ్వూరి రవి, నాయకులు పాల్గొన్నారు.

డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో భోజనాలు

జగ్గంపేట రూరల్, సెప్టెంబరు 17: జనసేన జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో ప్రతి మంగళవారం పట్టణంలో డొక్కా సీతమ్మ క్యాంటీన్‌ను నిర్వహిస్తున్నారు. మెయిన్ రోడ్డు పాత పోలీస్‌స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన క్యాంటీన్లో మంగళవారం 200 మందికి భోజనాలు అందజేశారు. మాదారపు వీరబాబు, రామవరం ఎంపీటీసీ దొడ్డి శ్రీను, సత్తి సోమరాజు, మొగిలి గంగాధర్, వేణుగోపాల్, కాయల మణికంఠ, సత్యంశెట్టి గణేష్, సూరపు రెడ్డి నరేష్, రేవూరి శ్రీనివాస్ ఉన్నారు.

ఉచిత పశు వైద్యశిబిరం

తాళ్లరేవు, సెప్టెంబరు 17: నీలపల్లి పంచాయతీ నేరేల్లంక గ్రామంలో రాష్ట్ర గోకుల్ మిషన్ సారథ్యంలో పశువులకు గర్భకోశ చికిత్స ఉచిత వైద్యశిబిరాన్ని మంగళవారం సర్పంచ్ చిట్టూరి నాగమణి ప్రారంభించారు. డాక్టర్ దవులూరి సుధ పర్యవేక్షణలో రూ.20వేలు ఖరీదుచేసే మందులతో 34ఆవులు, 29గేదెలకు చికిత్స.. 45పశువులకు నట్టల నివారణ చికిత్స చేశారు. టీడీపీ నేతలు టేకుమూడి లక్ష్మణరావు, ధూళిపూడి వెంకటర్యామణ, ఉప సర్పంచ్ వస్కా రెడ్డి, పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ బ్రహ్మవేద, పశువైద్యాధికారులు సుధీర్, శ్రీనివాస్, శుభశ్రీ, రమణమూర్తి, ప్రియాంక పాల్గొన్నారు.

న్యాయం చేయాలని వృద్ధురాలి ఆందోళన

గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 17: తనకు గల పంటభూమిని, నివాసాన్ని బంధువులే ఆక్రమించుకుని బయటకు గెంటి వేశారని తనకు న్యాయం చేయాలని ఒక వృద్ధురాలు గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నివాసం వద్ద మంగళవారం ఆందోళన చేసింది. మల్లాం పరిసర గ్రామంలో ఉన్న 11.11 ఎకరాల పంటపొలాన్ని ఆక్రమించుకున్నారని పిఠాపురం మండలం మల్లాం గ్రామానికి చెందిన వృద్ధురాలు కుంపట్ల మణిరత్నం తన మేనకోడలితో కలిసి పవన్ నివాసం వద్దకు వచ్చి వివరించింది. కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేసింది.

వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన ఎంపీడీవో

కిర్లంపూడి, సెప్టెంబరు 17: మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాలైన రాజుపాలెం, ముక్కొల్లు, భూపాలపట్నం, ఎస్.తిమ్మాపురం, ఎస్ఆర్ పాలెం పంచాయతీల్లో మంగళవారం ఎంపీడీవో బడే రాజేశ్వరరావు పర్యటించారు. గృహ సముదాయాల ఎన్యుమరేషన్, బ్యాంకు ఖాతాల సేకరణ, నమోదు, పారిశుధ్యం విషయాలపై ఆరా తీశారు. ప్రజానీకానికి ఏ ఇబ్బందులు రాకుండా యంత్రాంగం పనిచేయాలన్నారు.

రేపు కాకినాడలో ఏచూరి సంస్మరణ సభ

కాకినాడ సిటీ, సెప్టెంబరు 17: కలెక్టరేట్ ఎదురుగా ఉన్న రెవెన్యూ ఎంప్లాయిస్ అసోసియేషన్ భవన్‌లో గురువారం సాయంత్రం 4 గంటలకు సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఏచూరి సీతారాం సంస్మరణ సభ ఏర్పాటు చేసినట్టు కాకినాడ పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు తెలిపారు. జాతీయ, ప్రాంతీయ రాజకీయ పార్టీల జిల్లా, నగర ప్రతినిధులు, ప్రజాసంఘాల నాయకులు, ఉద్యోగ, మహిళా, యువజన, కార్మిక, వ్యాపార వర్గాల వారు పాల్గొనాలని ఒక ప్రకటనలో కోరారు.

రేపు నరేంద్రగిరిపై రామాలయ శ్లాబ్ నిర్మాణపనులు

ప్రత్తిపాడు, సెప్టెంబరు 17: ఆంధ్రా భద్రాద్రిగా ప్రాచుర్యం పొందిన స్థానిక నరేంద్రగిరి కొండపై రామాలయ నిర్మాణంలో భాగంగా ఈనెల 19న శ్లాబ్ నిర్మాణ పనులు నిర్వహిస్తున్నట్టు శ్రీరామనామ క్షేత్రం వ్యవస్థాపక అధ్యక్షుడు గల్లా సుబ్బారావు, కార్యదర్శి పుష్పారెడ్డి, రెడ్నం రాజా తెలిపారు. మంగళవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ రామాలయ శ్లాబు నిర్మాణం జరిగే ప్రదేశంలో గురువారం ఉదయం నుంచి పలు ఆశ్రమాల స్వామిజీలు, మాతాజీలు, ఆధ్యాత్మిక వేత్తలతో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో గానాల గంగాధర్, పత్రి రమణ పాల్గొన్నారు.

వినాయక లడ్డూ వేలం పాట

కొత్తపల్లి, సెప్టెంబరు 17: కొత్తపల్లి పోలమ్మగుమ్మం సెంటర్లో 40వ గణేష్ వార్షికోత్సవం ముగింపు సందర్భంగా 18 కిలోల లడ్డూకు కమిటీ నిర్వాహకులు సోమవారం వేలం నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ దుంప మనోజ్‌కుమార్ రూ.37వేలకు వేలం పాట ద్వారా లడ్డూను దక్కించుకోవడం విశేషం.

'ప్రతీ సమస్యను పరిష్కరించాలి'

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 17: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా వచ్చిన ప్రతీఒక్క సమస్యను సత్వరమే పరిష్కరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ భావన ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని, అనంతరం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను నిర్వహించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో 11 వినతులు స్వీకరించారు. ఎస్ఈ సత్యకుమారి, స్మార్ట్‌సిటీ ఎస్ఈ వెంకటరావు, ఈఈ మాధవి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీచరణ్, డీసీపీ హరిదాస్, మేనేజర్ కర్రి సత్యనారాయణ,ఉద్యాన సహాయ సంచాలకులు టీవీ శిరిల్ ఉన్నారు.

అర్జీలు స్వీకరించిన ఎంపీ

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 17: మంగళగిరిలో జనసేన కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జనవాణి (జనసేన భరోసా) కార్యక్రమంలో భాగంగా మంగళవారం కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అర్జీదారుల సమస్యలు నమోదు చేసుకున్నారు. తక్షణ పరిష్కారానికి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

ప్రభుత్వ ఐటీఐకి సీపోర్ట్సు సీఎస్ఆర్ ఫండ్స్

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 17: కాకినాడ ప్రభుత్వ ఐటీఐకి కాకినాడ సీపోర్ట్సు ఇచ్చిన సీఎస్ఆర్ ఫండ్‌తో ఐటీఐ మెయిన్ బిల్డింగ్‌కి పెయింటింగ్ పనులు, సివిల్ వర్క్స్, మోటార్ మెకానిక్ ట్రేడ్‌కు శిక్షణ నిమిత్తం డ్రైవింగ్ స్టిములేటర్, 150 డ్యూయల్ డెస్కులు తయారు చేసుకోవడానికి మెటీరియల్ అందజేశారు. పనులు పూర్తి కావడంతో మంగళవారం ప్రారంభించారు. సీపోర్ట్సు లిమిటెడ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మురళీధర్, రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, ఐఎంసీ చైర్మన్ కె.రామకృష్ణ, ఐటీఐ ప్రిన్సిపాల్ ఎం.వేణుగోపాల వర్మ ఉన్నారు.

నులిపురుగులను నులిమేద్దాం : ఎమ్మెల్యే సత్యప్రభ

ప్రత్తిపాడు, సెప్టెంబరు 17: ఆరోగ్యవంతమైన పిల్లల కోసం నులిపురుగులను నులిమేద్దామని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా పిలుపునిచ్చారు. జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా స్థానిక జడ్పీ హైస్కూల్లో మంగళవారం ఏర్పాటు చేసిన పోస్టర్‌ను ఎమ్మెల్యే, పలువురు ఆవిష్కరించారు. విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు మాత్రలు పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ యాళ్ళ విశేశ్వరరావు, టీడీపీ నాయకులు యాళ్ళ జగదీష్, అంబటి రాంబాబు, రావూరి తాతాజీ, పోలిశెట్టి శ్రీనివాస్, హైస్కూల్ హెచ్ఎం పాల్గొన్నారు.

గండేపల్లి: సూరంపాలెంలో ఆదిత్య యూనివర్శిటీలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నులి పురుగు నియంత్రణ మాత్రలు పంపిణీ నిర్వహించినట్టు డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. సూరంపాలెం హెల్త్ ఆఫీసర్లు డాక్టర్ టి.రామకిషోర్, డాక్టర్ కె.దినేష్ కుమార్, డీన్ క్యాంపస్ లైఫ్ మేనేజ్‌మెంట్ ప్రో వి.సత్యనారాయణ, అసోసియేట్ డీన్ ఫ్రెష్‌మెన్ ఇంజనీరింగ్ డాక్టర్ ఎ.వానతి పాల్గొన్నారు.

గొల్లప్రోలు రూరల్: తాటిపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసి మింగించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం నాగలక్ష్మి, గొల్లప్రోలు ఎంపీహెచ్ఈవో శ్రీనివాస్, ఎంపీహెచ్ఎస్ భాషా, ఆశ వర్కర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తొండంగి: ఏవీనగం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో 14 వందల మంది చిన్నారులకు ఆల్బెండాజోల్ మాత్రలు వేశారు. ఏవీనగరంలో టీడీపీ సీనియర్ నేతలు యనమల నాగేశ్వరావు, కొయ్యాశ్రీను జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మాత్రలు వేశారు. సూపర్‌వైజర్ సత్యన్నారాయణమూర్తి, మణి పాల్గొన్నారు. పిఇ.చిన్నయ్యపాలెంలో టీడీపీ నేతలు నరహరిశెట్టి ప్రకాష్, వడ్డి రాంబాబు మాత్రలు వేశారు.

భాద్రపద పూర్ణిమ పూజలు

ప్రత్తిపాడు, సెప్టెంబరు 17: రాచపల్లిలో గల అపీత కుంచాంబ సమేత అరుణాచలేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం భాద్రపద పూర్ణిమ పూజలు నిర్వహించారు. అరుణాచలేశ్వర స్వామికి పంచామృత అభిషేకాలు... అమ్మవారికి లలిత సహస్ర నామ పారాయణ, మణిదీప వర్ణన, అభిషేకాలు, అర్చనలు, పారాయణాలు, ప్రవచనాలు నిర్వహించారు.

కొనసాగిన గణేష్ నిమజ్జనాలు

పిఠాపురం, సెప్టెంబరు 17: పట్టణంలో మంగళవారం గణేష్ నిమజ్జనాలు కొనసాగాయి. లయన్స్ కల్యాణ మండపం ఏరియాలో నిలిపిన గణనాథుడిని కోలాట నృత్యాల నడుమ ప్రదర్శనగా తీసుకెళ్లి పట్టణ శివారు గోదావరి కాలువలో నిమజ్జనం చేశారు. భక్తులు అధికంగా పాల్గొన్నారు.

గొల్లప్రోలులో దీపోత్సవం

గొల్లప్రోలు, సెప్టెంబరు 17: పట్టణంలోని వడ్డి వారి సెంటర్‌లో వినాయక మండపం వద్ద దీపోత్సవం నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భక్తులు, మహిళలు, చిన్నారులు దీపాలు వెలిగించారు. వినాయకుడికి ప్రత్యేక పూజలు జరిగాయి. పూజల్లో అధికంగా భక్తులు పాల్గొన్నారు.

వరద బాధితుల సహాయార్థం రూ.5 లక్షల విరాళం



ఎమ్మెల్యేకు చెక్కు అందజేస్తున్న టౌన్ హాల్ సభ్యులు

కాకినాడ సిటీ, సెప్టెంబరు 17: విజయవాడ వరద బాధితుల సహాయార్థం కాకినాడ లిటరరీ అసోసియేషన్ (టౌన్ హాల్) సభ్యులు సీఎం సహాయనిధికి రూ.5లక్షల విరాళం చెక్కును కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబుకు అందజేశారు. ఈ మేరకు జగన్నాథపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన్ను మంగళవారం వారు కలిశారు. కార్యక్రమంలో టౌన్ హాల్ అధ్యక్షుడు జి.సత్యనారాయణమూర్తి (నానాజీ), ఉపాధ్యక్షుడు గోలి రఘునాథ్, కార్యదర్శి పాబోలు చిన్నపున్నయ్య, సంయుక్త కార్యదర్శి వీవీ సుబ్రహ్మణ్యం, కోశాధికారి రవిరాజ్, కమిటీ సభ్యులు బచ్చు శేఖర్, నెక్కంటి శ్రీనివాస్, పెద్దిరెడ్డి సతీష్ పాల్గొన్నారు.

వరద బాధితుల కోసం విరాళం

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 17: వరద బాధితుల సహాయార్థం కాకినాడ త్రిదళాల మాజీ సైనికుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు జీఎస్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ షాన్ మోహన్‌కు రూ.42,300 చెక్కును అందజేశారు. మాజీ సైనికులను కలెక్టర్ అభినందించారు. సంఘం అధ్యక్షుడు శ్రీనగేష్, ఉపాధ్యక్షుడు ఎస్ సూర్యదేవర రామారావు, సెక్రటరీ డీకే వరప్రసాద్ తదితరులు ఉన్నారు.

వరద బాధితులకు దుస్తుల పంపిణీ

కిర్లంపూడి, సెప్టెంబర్ 17: రాజుపాలెంలో గంధం ఈశ్వరరావు, మాజీ ఎంపీటీసీ గోడే దొరబాబు ఆధ్వర్యంలో వరద బాధితులకు దుస్తులు పంపిణీ చేశారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ముఖ్యఅతిథిగా హాజరై అందజేశారు. తోట గాంధీ, ఎస్వీఎస్ అప్పలరాజు, బస్వా వీరబాబు, సర్పంచ్ జ్యోతుల రాంబాబు, కంటా శ్రీను, కొల్లా రాజారావు ఉన్నారు.

జెమినీ సురేష్‌కు సత్కారం



తాళ్లరేవు, సెప్టెంబరు 17: పి.మల్లవరంలో సినీ నటుడు, జనసేన నేత జెమినీ సురేష్‌కు పి.మల్లవరం రామాలయం వద్ద జనసేన నేత వేగి రుద్రనాగభైరవ ప్రసాద్ ఆధ్వర్యంలో జనసైనికులు మంగళవారం చిరు సత్కారం చేశారు. జెమినీ సురేష్ షూటింగ్‌లో భాగంగా పి.మల్లవరం విచ్చేశారని, ఎన్నికల్లో జనసేన గెలుపు కోసం విశేష కృషిచేశారన్నారు. కార్యక్రమంలో పి.మల్లవరం, పోలేకుర్రు జనసైనికులు పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ ట్రైనింగ్ ప్రారంభం

తుని రూరల్, సెప్టెంబరు 17: భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ బేసిక్ ట్రైనింగ్ కార్యక్రమం ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు జిల్లాస్థాయిలో తుని మండలం దొండవక గ్రామంలో జరిగింది. తుని అర్బన్, రూరల్ కోటనందూరు, శంఖవరం, తదితర మండలాల నుంచి ఉపాధ్యాయులు హాజరయ్యారు. కార్యక్రమాన్ని జిల్లా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సెక్రటరీ ఎంవీవీ సత్యనారాయణ ప్రారంభించారు.

ఎమ్మెల్యేకు సన్మానం

రౌతులపూడి, సెప్టెంబరు 17: ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభను మూలగపూడి సర్పంచ్, టీడీపీ మండలాధ్యక్షుడు తమరాల సత్యనారాయణ దంపతులు సన్మానించారు. వేములమ్మతల్లి మొక్కుబడి నిమిత్తం ఎమ్మెల్యే మూలగపూడి విచ్చేయగా కార్యకర్తలు దుశ్శాలువా కప్పి సన్మానించారు. ఎంపీపీ గంటిమళ్ల రాజ్యాలక్ష్మి, గాడి రాంబాబు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

రౌతులపూడి, సెప్టెంబరు 17: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన కోళ్ల రాంబాబు, ఎన్.సింహాచలం, వై.రాజులును మండల యూటీఎఫ్ ఆధ్వర్యంలో రౌతులపూడి జిల్లా పరిషత్ హైస్కూల్ నందు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవోలు గాడి కొండబాబు, ఎ.శ్రీనివాస్, యూటీఎఫ్ మండలాధ్యక్షుడు కోరుప్రోలు హరిబాబు, నాగరాజు, తాతబాబు, అచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

మొక్కు తీర్చుకున్న జనసైనికులు

గొల్లప్రోలు, సెప్టెంబరు 17: గొల్లప్రోలు పట్టణానికి చెందిన పలువురు జనసైనికులు పవన్‌కల్యాణ్ పిఠాపురం ఎమ్మెల్యేగా విజయం సాధిస్తే శబరిమలై అయ్యప్పస్వామి కొండకు వస్తామని మొక్కుకున్నారు. ఎన్నికల్లో విజయం సాధించి డిప్యూటీ సీఎంగా పవన్ బాధ్యతలు చేపట్టడంతో వారు శబరిమలై వెళ్లి అయ్యప్పస్వామి దర్శనంచేసుకున్నారు.

'వార్డు మెంబర్‌పై చర్యలు తీసుకోండి'

ప్రత్తిపాడు, సెప్టెంబరు 17: మండలంలోని చింతలూరు వైసీపీ వార్డు మెంబర్ మాసా అర్జున్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ కార్యదర్శి లొండా గంగాధర్, సచివాలయ సిబ్బంది మంగళవారం ఎమ్మెల్యే సత్యప్రభకు వినతిపత్రం అందజేశారు. నిబంధనలకు విరుద్ధంగా పనులు చేయాలంటూ బెదిరిస్తూ దౌర్జన్యాలకు పాల్పడుతున్నారన్నారు.

మాజీ కౌన్సిలర్ మృతి

పెద్దాపురం, సెప్టెంబరు 17: మున్సిపల్ మాజీ కౌన్సిలర్ తోట కామరాజు (92) మంగళవారం తెల్లవారుజామున మృతి చెందారు. గతంలో ఆయన 2పర్యాయాలు కోఆప్షన్ సభ్యుడిగా సేవలందించారు. కౌన్సిలర్లు ఆరెళ్ల వీర్రాఘవరావు, ఆకుల కృష్ణబాబూజీ, తోట చంటిబాబు, సీపీఎం మండల కార్యదర్శి నీలపాల సూరిబాబు సంతాపం వ్యక్తం చేశారు.


భారీ అన్నదానం

జగ్గంపేట రూరల్, సెప్టెంబరు 17: జగ్గంపేట శ్రీరామ్‌నగర్ గణేష్ యూత్ ఆధ్వర్యంలో భారీ అన్నదానం నిర్వహించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. జీను మణిబాబు, మారిశెట్టి రాధా, బొండ శ్రీను, దేవరపల్లి మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితుడికి సాయం

కాకినాడ సిటీ, సెప్టెంబరు 17: పెదపూడి మండలం వేండ్రలో జరిగిన అగ్నిప్రమాదంలో ఇల్లు దగ్ధమై నిరాశ్రయులైన వార్డు మెంబర్ మేడసాని రాఘవ వెంకటేశులు కుటుంబాన్ని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పరామర్శించి రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన చంద్రమౌళి



సామర్లకోట, సెప్టెంబరు 17: మంత్రి నారా లోకేశ్‌ను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుణ్ణం చంద్రమౌళి మంగళవారం ఉండవిల్లిలోని నివాసంలో కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి అభినందించారు. విజయవాడ, కాకినాడ జిల్లాల్లో వరద బాధితులకు ప్రభుత్వం అందించిన సేవా కార్యక్రమాలపై అభినందనలు వెల్లువెత్తుతున్నాయని లోకేశ్‌కు తెలిపారు. కాకినాడ జిల్లాలో టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు సేవా కార్యక్రమాలను చంద్రమౌళి వివరించారు.